



ఉష్ణోగ్రతలు
గరిష్ఠం కనిష్ఠం | 38.0 27.0



తాడిపత్రిలో భద్రతకు వచ్చిన పోలీసులు

# పాపం.. పోలీసులు!

తాడిపత్రిలో భారీగా బలగాలు

సరైన భోజనం అందక ఇబ్బందులు

- తడిసి మోపెడవుతున్న భోజనం ఖర్చు
- భరించేది ఎవరని అధికారుల ఆవేదన
- లాడ్జిలు.. కళ్యాణ మండపాల్లో వసతి

ఎన్నికల గొడవల నేపథ్యంలో భద్రత విధులకు వచ్చిన పోలీసులకు భోజనం కష్టాలు వెంటాడుతున్నాయి. సరైన భోజనం అందక సిబ్బంది.. భోజనం ఏర్పాట్లకు నిధులు లేక పోలీసు అధికారులు తిప్పలు పడుతున్నారు. పోలింగ్, ఆ మరుసటి రోజున గొడవలతో తాడిపత్రిలో శాంతిభద్రతలు అదుపు తప్పాయి. ఎన్నికల కమిషన్ సీరియస్ కావడంతో పోలీసు శాఖ పటిష్ట బందోబస్తుకు చర్యలు తీసుకుంది. సాధారణ పోలీసులతోపాటు ర్యాపిడ్ ఫోర్స్, సీఆర్పీఎఫ్ బలగాలను మోహరించారు. ఇక్కడ సుమారు వెయ్యి మంది బందోబస్తు విధుల్లో ఉన్నట్లు సమాచారం. కర్నూలు, అనంతపురం బెటాలియన్ల నుంచి వచ్చిన బలగాలతోపాటు కేరళ, తమిళనాడు, నాగాలాండ్ తదితర రాష్ట్రాల నుంచి కూడా ఎన్నికల భద్రతకు సిబ్బంది వచ్చారు. వీరందరూ భోజనం సమస్యను ఎదుర్కొంటున్నారు. - తాడిపత్రి టౌన్



టౌన్ పీఎస్‌లో భోజనానికి వెళుతున్న పోలీసులు

### వసతికీ ఇబ్బందులే..

బందోబస్తుకు వచ్చిన సిబ్బందికి సరైన వసతి కూడా కల్పించలేదు. పట్టణంలోని పలు కల్యాణమండపాలు, లాడ్జిలను వసతికి వినియోగిస్తున్నారు. పోలింగ్ జరిగే రెండు రోజులే కదా అని లాడ్జిల యజమానులు గదులను ఇచ్చారు. కానీ ఆ తరువాత గొడవలు జరగడంతో వచ్చినవారు కదలడం లేదు. కౌంటింగ్ పూర్తయ్యాక కూడా.. వచ్చే నెల 19వ వరకూ భద్రత కొనసాగే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో సమస్య ఎప్పుడు పరిష్కారమౌతుందో.. తమ గదులను ఎప్పుడు ఖాళీ చేస్తారో అని లాడ్జిల యజమానులు ఆవేదన చెందుతున్నారు. పోలీసులు కాబట్టి ఏమీ అనలేక మిన్న కుండిపోతున్నారు.

పోలీస్‌స్టేషన్‌లో వంట తయారీ



### నెలకు రూ.80 లక్షలు

తాడిపత్రిలో బందోబస్తులో ఉన్న పోలీసులకు భోజనం పెట్టేందుకు నెలకు రూ.80 లక్షలకు పైగానే ఖర్చు అవుతుందని భావిస్తున్నారు. ఈ నెల 14 నుంచి ర్యాపిడ్ ఫోర్స్, సీఆర్పీఎఫ్ బలగాలు, రాయలసీమలోని పలు పోలీస్‌స్టేషన్ల సిబ్బంది తాడిపత్రి లోనే ఉంటున్నారు. జూన్ 4న కౌంటింగ్ అనంతరం జూన్ 19 వరకు బలగాలు కొనసాగిం చనున్నట్లు తెలిసింది. అంటే.. నెలరోజులకు పైగానే బలగాలు ఇక్కడ ఉంటాయి. ఆ తరువాత ఏవైనా గొడవలు జరిగితే బలగాలను కొనసాగించాల్సి వస్తుంది. అప్పటి దాకా ఖర్చులు ఎవరు భరిస్తారన్నదే ప్రశ్న.

### డీఎస్పీ సస్పెండ్ అయ్యాక..

బందోబస్తుకు వచ్చిన బలగాలకు భోజనం ఖర్చు రోజుకు రూ.2 లక్షల దాకా అవుతోంది. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం సమకూర్చేందుకు భారీగా ఖర్చు అవుతోంది. కానీ ప్రభుత్వం నుంచి ఆ మేరకు నిధులు రాలేదు. దీంతో ఏం చేయాలో తెలియక పోలీసు ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నారు. డీఎస్పీ గంగయ్య తాడిపత్రిలో ఏడాదికి పైగా పనిచేశారు. ఎన్నికల నేపథ్యంలో ఆయన దాతల సహకారంతో పోలీసు బలగాలకు భోజనం ఏర్పాటు చేశారు. కానీ హింసాత్మక ఘటనల కారణంగా ఆయన సస్పెండ్ అయ్యారు. దీంతో భద్రతా సిబ్బంది మంచిచెడ్డలు చూసేవారే కరువయ్యారు. డీఎస్పీ గంగయ్య వెళ్లిన మరుసటిరోజు నుంచి పోలీసు బలగాలకు టిఫిన్, భోజనం పెట్టేనాథుడే లేడన్న విమర్శలు వస్తున్నాయి. పలు ప్రాంతాల్లో బందోబస్తుగా ఉన్న పోలీసులు పట్టణ పోలీస్‌స్టేషన్‌కు రాలేక ఉన్నచోటే సొంత డబ్బులతో భోజనం చేస్తున్నారు.



### సీనియర్లకు ఇబ్బందులు..



- ఓ ఉన్నతాధికారి ఆదేశాలతో తాడిపత్రి పట్టణ పోలీస్ స్టేషన్‌లో పోలీసు సిబ్బందికి వంట తయారు చేసి వడ్డిస్తున్నారు. మెనూ ప్రకారం ఉదయం పొంగళి, ఉప్మా, మధ్యాహ్నం, రాత్రి అన్నం, పప్పు, రసం, మజ్జిగ పెడుతున్నారు. వయసు రీత్యా ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న సీనియర్లు రాత్రి పూజ భోజనం చేయడానికి ఇబ్బంది పడుతున్నారు. బీపీ, షుగర్ ఉన్నవారు రాత్రిళ్లు అన్నం తినడం లేదు. సొంత డబ్బులు వెచ్చించి.. వేరే చోట భోజనం చేస్తున్నారు. మరికొందరు దొరికిన భోజనంతో సర్దుకుంటున్నారు.
- తాడిపత్రి పరిసరాల్లోని 10 కి.మీ. పరిధిని పోలీసులు తమ అధీనంలోకి తీసుకున్నారు. అనంతపురం రోడ్డులో ఫ్లైఓవర్ బ్రిడ్జి, కడప రోడ్డు, యల్లనూరు రోడ్డు శివారు, పుట్లూరురోడ్డు శివారు, చుక్కలూరు రోడ్డు, పప్పూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఇక్కడ విధుల్లో ఉన్నవారికి పట్టణ పోలీస్‌స్టేషన్‌లోనే వంటావార్పు ఏర్పాటు చేశారు. బందోబస్తులో ఉన్నవారు ఇక్కడికే వచ్చి భోజనం చేసి వెళ్లాల్సి వస్తోంది. దీంతో అంతదూరం వచ్చేందుకు వాహనాలు లేక.. చెక్‌పోస్టుల సమీపంలో దొరికే ఆహారంతోనే సిబ్బంది సర్దుకుంటున్నారు.

అభివృద్ధి నిధులు

# స్వాహా..!



## గుంతకల్లు ఎంపీడీఓ కార్యాలయంలో మాయ

అధికారులు, వైసీపీ నాయకులు కుమ్మక్కు

రూ.85 లక్షల దాకా పక్కదారి

ఓ మహిళా ఉద్యోగి ఖాతాకు రూ.20 లక్షలు

ఫిర్యాదులు వెళ్లినా స్పందించని జడ్పీ అధికారులు

అనంతపురం విద్య, మే 22: అభివృద్ధి పనులకు వినియోగించాల్సిన నిధులను కొందరు అధికారులు.. అధికార పార్టీ నాయకులు కుమ్మక్కై కాజేశారు. గుంతకల్లు ఎంపీడీఓ కార్యాలయం వేదికగా సుమారు రూ.85 లక్షల వరకూ ఆరగించినట్లు సమాచారం. గతంలో పనిచేసిన కొందరు అధికారులు, వైసీపీ ప్రజాప్రతినిధులు ఏకమై స్వాహా చేశారని విశ్వసనీయంగా తెలిసింది. పనులు సక్రమంగా చేయకుండా జేబులు నింపుకున్న ఈ వ్యవహారం గురించి జడ్పీ అధికారులకు లిఖితపూర్వక ఫిర్యాదులు వెళ్లినా.. ఎలాంటి స్పందన లేదని అంటున్నారు. ఈ క్రమంలో ఏకంగా ఒక మహిళా ఉద్యోగి సొంత ఖాతాకు రూ.20 లక్షలు మళ్లించారని ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు, నాయకులు కలిసి నాలుగేళ్లలో రూ.60 లక్షల నుంచి రూ.85 లక్షలు కాజేశారని తెలిసింది. కలెక్టర్ దృష్టి సారిస్తే ఈ అవినీతి బాగోతం బయటపడుతుందని అంటున్నారు.

### దోపిడీకి ఏకమయ్యారా....?



గుంతకల్లు మండలంలో గతంలో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించారు. ఎంపీడీఓ కార్యాలయ పరిధిలో ప్రజాభివృద్ధికి వీటిని ఖర్చు చేయాల్సి ఉండగా.. పనులు సక్రమంగా చేయకుండా నిధులను పక్కదారి పట్టించారు. 2019 నుంచి గత ఏడాది చివరి వరకూ పనిచేసిన ఒక ఎంపీడీఓ, మరో ముగ్గురు అధికారులు, కొందరు కాంట్రాక్టర్లు, వైసీపీ నాయకులు కలిసి ఈ మాయాజాలం చేశారని ఆరోపణలు వస్తున్నాయి. గత నాలుగేళ్ల కాలంలో జనరల్ ఫండ్స్, 15వ ఆర్థిక సంఘం నిధులను విచ్చలవిడిగా డ్రా చేశారని తెలిసింది. పనులు చేసినట్లు సరైన డాక్యుమెంట్లు లేకుండానే నిధులను డ్రా చేసి స్వాహా చేశారని సమాచారం.

### ఆమె ఖాతాకు రూ.20 లక్షలు



నిధులను పక్కదారి పట్టించిన వ్యవహారంలో ఓ మహిళా ఉద్యోగి కీలకంగా వ్యవహరించినట్లు కనిపిస్తోంది. ఆమె ఖాతాకు ఏకంగా రూ.20 లక్షలు మళ్లించారని ఆరోపణలు ఉన్నాయి. గుంతకల్లులో పనిచేస్తూ మరో మండలానికి బదిలీ అయిన ఆమె, తన అక్రమాలు బయట పడకుండా మళ్లీ గుంతకల్లుకు డెప్యుటేషన్ వేయించుకున్నారని తెలిసింది. ఆమె సొంత ఖాతాకు అంత సొమ్ము ఎందుకు మళ్లించారనే అనుమానాలు కలుగుతున్నాయి.కొత్తగా వచ్చిన ఎంపీడీఓ.. ఆమెకు మెమో కూడా జారీ చేసినట్లు సమాచారం. అయితే ఇప్పటి వరకూ ఆమె సంజాయిషీ ఇవ్వలేదని తెలుస్తోంది.

### జడ్పీ అధికారుల మౌనం..?

గుంతకల్లు ఎంపీడీఓ కార్యాలయంలో సాగిన నిధుల గోల్‌మాల్ గురించి ఇటీవల జడ్పీ సీఈఓకు పలువురు ఫిర్యాదు చేశారు. భారీగా అక్రమాలు జరిగాయని, విచారించి.. బాధ్యులైన ఎంపీడీఓ, మరో నలుగురు ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కానీ జడ్పీ అధికారులు ఇప్పటి వరకు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కలెక్టర్ దృష్టి సారించి విచారణ చేయిస్తే అక్రమాల గుట్టు రట్టయ్యే అవకాశం ఉంది.



గుంతకల్లు ఎంపీడీఓ కార్యాలయం




బీటీపీ రిజర్వాయర్

## బీటీపీకి వరద

గుమ్మఘట్ట, మే 22: కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వేదవతి హగరి నదిలో వరద ప్రవాహం పెరిగి భైరవాన్‌తిప్ప రిజర్వాయర్‌కు నీరు చేరుతోంది. రిజర్వాయర్‌లో నీటిమట్టం బుధవారం సాయంత్రానికి 1640.8 అడుగులకు చేరింది. వరదలకు మునుపు రిజర్వాయర్‌లో 1635 అడుగుల డెడ్‌స్టోరేజీ ఉండేది. వరదనీరు చేరడంతో 5.8 అడుగుల మేర నీటి మట్టం పెరిగింది. కర్ణాటకలోని హిరియూరు, శిర తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో ఆ ప్రాంతంలోని చెక్‌డ్యాంలు నిండి హగరి నది పొంగి ప్రవహిస్తోంది. ఖరీఫ్ ఆరంభంలోనే రిజర్వాయర్‌కు నీరు చేరడంతో కుడి, ఎడమ కాలువల ఆయకట్టు రైతుల్లో హర్షం వ్యక్తమౌతోంది. ఎడమకాలువ కింద 8,400 ఎకరాలు, కుడి కాలువ కింద 4,350 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ఏడాది రొటేషన్ పద్ధతిలో ఎడమ కాలువ ఆయకట్టు రైతులకు సాగునీరు అందించే అవకాశం ఉంది. ఆగస్టుకు బీటీపీ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీరు చేరే అవకాశం ఉందని భావిస్తున్నారు.

## వేరుశనగ విత్తనాన్ని 90 శాతం సబ్సిడీతో ఇవ్వండి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, మే 22: ఖరీఫ్ సాగుకోసం రాష్ట్ర ప్రభుత్వం 90శాతం సబ్సిడీతో రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నల్లప్ప అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది తీవ్రమైన వర్షాభావం కారణంగా జిల్లాలో 29 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రభుత్వం ప్రకటించిందని అన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులకు పంట సాగు కష్టసాధ్యంగా మారిందని అన్నారు. కాబట్టి ప్రభుత్వం 90శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనాలు పంపిణీ చేయాలని కోరారు. ఈ విషయంపై జిల్లా వ్యాప్తంగా అన్ని తహసీల్దారు కార్యాలయాల్లో శుక్రవారం వినతిపత్రాలు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతులు విరివిగా పాల్గొనాలని కోరారు. గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేసేందుకు జిల్లా వ్యవసాయశాఖ అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుభరోసా కేంద్రాలకు చేరుతున్న విత్తనాల నాణ్యతను పరిశీలించాలని కోరారు. పత్తి విత్తనాల నాణ్యతాలోపం వల్ల గత ఏడాది జిల్లాలో రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారని, ఈ ఏడాది ఆ పరిస్థితులు పునరావృతమవకుండా చూడాలని కోరారు.

## సొంతబడికి వెళ్లని టీచర్

డీఈఓ విచారణ



అనంతపురం విద్య, మే 22: జిల్లా విద్యాశాఖలో కొందరు ఉపాధ్యాయులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను గాలికి వదిలేస్తున్నారు. డెప్యుటేషన్, వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌పై ఉన్న ఉపాధ్యాయులు, విద్యాసంవత్సరం చివరి పనిరోజున (లాస్ట్ వర్కింగ్ డే) అక్కడ రిలీవై.. తమ పాత పాఠశాలలో విధుల్లో చేరాలి. కానీ ఓ హిందీ టీచర్ ఈ నిబంధనను పాటించలేదని సమాచారం. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న ఓ పాఠశాలలో కొన్నేళ్లుగా ఇదే తంతు జరుగుతోంది. డి.హీరేహాళ్ మండలంలోని ఓ పాఠశాల హిందీ స్కూల్ అసిస్టెంట్.. తపోవనం జడ్పీ హైస్కూల్‌లో డెప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 22న ఆమె రిలీవై.. డి.హీరేహాళ్ మండలంలోని సొంత స్కూల్‌లో విధుల్లో చేరాలి. కానీ ఆమె పట్టించుకోలేదని సమాచారం. అన్ని డెప్యుటేషన్లను రద్దు చేస్తూ.. డీఈఓ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో తపోవనం స్కూల్ హెచ్ఎం ఆమెను రిలీవ్ చేసినట్లు తెలుస్తోంది. కానీ హిందీ టీచర్ మాత్రం తన ఒరిజినల్ స్కూల్‌లో చేరలేదని సమాచారం. ఈ విషయంపై ఫిర్యాదు వెళ్లడంతో డీఈఓ వరలక్ష్మి ఆ పాఠశాల హెచ్ఎంను తన కార్యాలయానికి పిలిపించి విచారించినట్లు తెలిసింది. తాను రిలీవ్ చేశానని, ఆమె అక్కడ చేరిందో లేదో తనకు తెలియదని హెచ్ఎం వివరణ ఇచ్చినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై డీఈఓ విచారణ కొనసాగిస్తున్నారు.

# రేపటి నుంచి అడ్వాన్స్‌డ్ సప్లీ పరీక్షలు

ఏర్పాట్లపై కలెక్టర్ వినోద్ కుమార్ సమీక్ష

అనంతపురం టౌన్, మే 22: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 34 కేంద్రాలలో శుక్రవారం నుంచి జూన్ ఒకటో తేదీవరకూ పరీక్షలు ఉంటాయని ఆయన తెలిపారు. పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్‌లో బుధవారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2-30 గంటల నుంచి సాయంత్రం 5-30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. జనరల్, ఒకేషనల్ విద్యార్థులు మొదటి సంవత్సరం 16,901 మంది, ద్వితీయ సంవత్సరం 5,609 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. ప్రతి కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో రామక్రిష్ణారెడ్డి, డీవీఈఓ వెంకటరమణ నాయక్, డీఈఓ వరలక్ష్మి, ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత, విద్యుత్, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.



ఇంటర్ పరీక్షల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టరు వినోద్ కుమార్

### పది పరీక్షలకు 45 కేంద్రాలు

పరీక్ష రాసేరోజూ ఫీజు చెల్లించొచ్చు: డీఈఓ

అనంతపురం విద్య, మే 22: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా 45 పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తామని డీఈఓ వరలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24 నుంచి జూన్ 3 వరకూ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. నిర్ణీత తేదీల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ పరీక్షలు ఉంటాయని తెలిపారు. మొత్తం 13,332 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని పేర్కొన్నారు. పరీక్షలు జరిగే రోజుకూడా విద్యార్థులు ఫీజు చెల్లించి, హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలకు హాజరుకావచ్చునని తెలిపారు. అన్ని యజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకుని, అందరూ విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. ప్రస్తుతం సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులకు ఇదే చివరి అవకాశమని, ఫెయిల్ అయిన విద్యార్థులంతా పరీక్షలు రాసేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు చూడాలని కోరారు. వచ్చే ఏడాది 10వ తరగతి సిలబస్ పూర్తిగా మారుతున్న నేపథ్యంలో విద్యార్థులు ఈ ఏడాది సప్లిమెంటరీ పరీక్షలు మిస్ కాకుండా చూడాలని కోరారు.

## సింహవాహనంపై లక్ష్మీనారసింహుడు

ఉరవకొండ, మే 22: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం సింహ వాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన స్వామి వారిని మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చి సింహవాహనంపై కొలువు దీర్చారు. ఉత్సవమూర్తులను ఆలయం చుట్టూ ఊరేగించారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ కుటుంబసభ్యులు దాతలుగా వ్యవహరించారు. రాత్రి చంద్రప్రభవాహనంపై స్వామి వారు దర్శనమిచ్చారు. ఆలయ చుట్టూ ఉత్సవ మూర్తులను ఊరేగించారు. ఈ కార్యక్రమానికి జల్లిపల్లికి చెందిన వెంకటరెడ్డి కుటుంబసభ్యులు ఉత్సవ ఉభయదాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఈవో విజయ్ కుమార్, ఆలయసిబ్బంది మారుతీ, దీపక్ అర్చకులు పాల్గొన్నారు.

- లక్ష్మీనరసింహస్వామి బ్రహోత్సవాలలో భాగంగా గురువారం గోవాహనోత్సవం, శేషవాహనోత్సవం నిర్వహించనున్నారు.



సింహవాహనంపై దర్శనమిస్తున్న స్వామి వారు, ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు



## డీఎస్పీ చైతన్యను ఎవరు రప్పించారు ?

పోలీసు అధికారులను ప్రశ్నించిన సిట్

తాడిపత్రిలో కొనసాగుతున్న దర్యాప్తు



తాడిపత్రి టౌన్, మే 22: అనంతపురం జిల్లా తాడిపత్రిలో పోలింగ్ సందర్భంగా తలెత్తిన హింసాత్మక ఘటనలను అదుపు చేసే పేరిట కడప జిల్లా రాజంపేట డీఎస్పీ చైతన్య ఎవరు రప్పించారనే కోణంలో సిట్ దర్యాప్తు చేస్తోంది. జిల్లాలోని పలువురు పోలీసు అధికారులను సిట్ సభ్యులు శ్రీనివాస్, భూషణం, శ్రీనివాసులు ఈ విషయమై ప్రశ్నిస్తున్నా.. స్పష్టమైన సమాధానం రావడంలేదని తెలిసింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఏర్పాటైన సిట్.. తాడిపత్రిలో దర్యాప్తు కొనసాగిస్తోంది. వివాదాస్పద డీఎస్పీ చైతన్య గురించి పలువురు పోలీసు అధికారులను సిట్ బృందం బుధవారం విచారించినట్లు సమాచారం. తాడిపత్రిలో పనిచేసే సమయంలో వైసీపీ నాయకులతో అంటకాగిన డీఎస్పీ చైతన్యను ఎన్నికల అల్లర్ల సమయంలో ఎందుకు రమ్మన్నారు? అని సూటిగా ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. శాంతిభద్రతల పరిరక్షణ పేరిట తాడిపత్రికి ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి వచ్చిన డీఎస్పీ చైతన్య.. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. అక్కడ ఉన్న కంప్యూటర్ ఆపరేటర్ దాసరి కిరణ్‌తోపాటు టీడీపీ కార్యకర్తలను చితకబాదారు. తాడిపత్రి గొడవలకు బాధ్యులను చేస్తూ ఎస్పీ అమిత్ బర్దర్, తాడిపత్రి డీఎస్పీ గంగయ్య, తాడిపత్రి టౌన్ సీఐ మురళీకృష్ణను ఎన్నికల కమిషన్ సస్పెండ్ చేసింది. కానీ డీఎస్పీ చైతన్యపై ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఆయనను రాజకీయ ప్రోద్బలంతోనే రాజంపేట నుంచి తాడిపత్రికి రప్పించారని ప్రచారం జరుగుతోంది. ఆయన వచ్చీరావడంతోనే టీడీపీ వర్గీయులను టార్గెట్ చేశారని విమర్శలు వచ్చాయి. ఆయన వెళ్లిన పోయిన తరువాతే పరిస్థితి అదుపులోకి వచ్చిందని పలువురు చర్చించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో డీఎస్పీ చైతన్య గురించి సిట్ అధికారులు విచారణ చేయడం ఆసక్తికరంగా మారింది. శాంతిభద్రతల సమస్య తలెత్తడం వెనుక అడిషినల్ ఎస్పీ రామకృష్ణ వైఫల్యం ఉందా అనే కోణంలోనూ సిట్ అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

### ఎస్బీ హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

తాడిపత్రిలో గొడవలకు సంబంధించి ముందస్తు సమాచారం ఇవ్వడంలో విఫలమైనందుకు ఎస్బీ హెడ్‌కానిస్టేబుల్ ఈశ్వర్ రెడ్డిని సస్పెండ్ చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, ఆ రెండు రోజులూ అక్కడి పరిస్థితులను అధికారులకు ఈశ్వర్ రెడ్డి చేరవేశారని, ఎవరో నిర్లక్ష్యానికి మరెవరినో బలిపశువును చేశారని సొంత శాఖ నుంచే విమర్శలు వస్తున్నాయి. సిట్ దర్యాప్తు నేపథ్యంలో శాఖాపరంగా ఎవరో ఒకరిపై చర్యలు తీసుకోవాలన్న ఉద్దేశంతో కిందిస్థాయి సిబ్బందిని బలిపశువులను చేస్తున్నారన్న చర్చ పోలీసు శాఖలో నడుస్తోంది. మరికొందరిపైనా చర్యలు ఉంటాయని ప్రచారం జరుగుతోంది. దీంతో తమ తప్పు లేకపోయినా బలి తీసుకుంటారేమోనని కిందిస్థాయి సిబ్బందిలో పలువురు ఆందోళన చెందుతున్నారు.

## రైతు ఆత్మహత్య

ఉరవకొండ, మే 22: మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామానికి చెందిన రైతు నారాయణస్వామి(60) అప్పుల బాధతో బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. నారాయణస్వామికి మూడు ఎకరాల పొలం ఉంది. దీనికితోడు మరో 5 ఎకరాలను కౌలుకు తీసుకుని వేరుశనగ, కంది పంటలను సాగు చేసేవాడు. వ్యవసాయం కోసం రూ.15 లక్షలు దాకా అప్పు చేశాడు. నాలుగేళ్ల నుంచి పంటలు సరిగా పండక తీవ్రంగా నష్టపోయాడు. అప్పులు తీర్చేమార్గంలేక.. గ్రామ సమీపంలోని మోడల్ స్కూల్‌కు వెళ్లే రహదారిలో చెట్టుకు ఉరివేసుకున్నాడు. స్థానికులు గుర్తించేలోగా మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



నారాయణస్వామి (ఫైల్)

## ఆరోగ్యశ్రీ సేవల బంద్‌పై మిశ్రమ స్పందన

**అనంతపురం టౌన్, మే 22:** ఆరోగ్యశ్రీ సేవల బంద్‌పై ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. రూ. వందల కోట్లు ఆరోగ్యశ్రీ చికిత్సలకు అందాల్సిన నిధులు ప్రభుత్వం ఇవ్వడంలేదని, బకాయిలు చెల్లించే వరకు ఆరోగ్యశ్రీ సేవలు బంద్ చేస్తామని యాజమాన్యాలు నోటీస్ ఇచ్చి ప్రకటించాయి. జిల్లాలోను ఇక్కడ యాజమాన్యాలు రాష్ట్ర అసోసియేషన్ పిలుపు మేరకు ఆరోగ్యశ్రీ సేవలు బంద్ చేస్తామని వారి గ్రూప్‌ల్లో మాత్రమే ప్రకటించకున్నాయి. కనీసం మీడియాకు పిలిచి జిల్లాలో కూడా బంద్ చేస్తున్నట్లు ప్రకటించలేదు. కొన్ని ఆస్పత్రుల్లో ఆరా తీస్తే.. పాత కేసులకు మాత్రం చికిత్స అందిస్తున్నామని, కొత్త కేసులను తీసుకోవడంలేదని అన్నారు. మరికొన్ని ఆస్పత్రులను అడిగితే... సీరియస్ కేసులను తీసుకుంటున్నామని, నార్మల్ కేసులను వెనక్కు పంపిస్తున్నామని చెబుతున్నారు. దీనిపై ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ కిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో ఏ ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ బంద్ చేయలేదని, బుధవారం జిల్లాలో 92 కేసులను అడ్మిన్ చేసుకొని చికిత్సల కోసం ట్రస్ట్ ఆమోదానికి ప్రతిపాదనలు పంపారని అన్నారు. ఎక్కడైనా రోగులను చేర్చుకోలేదని తమ దృష్టికి వస్తే ఆయా ఆస్పత్రులతో మాట్లాడుతామని, వారు ఒప్పుకోకపోతే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఆ రోగులను చేర్పించి చికిత్సలు అందిస్తామని అన్నారు.

## దేహదానానికి ఎంఎన్‌ఓ అంగీకారం

**అనంతపురం టౌన్, మే 22:** తాను చనిపోయిన తర్వాత మెడికల్ కళాశాలకు తన దేహన్ని దానం చేస్తున్నానని ఆస్పత్రిలో పనిచేస్తున్న సీనియర్ ఎంఎన్‌ఓ నాగరాజు అంగీకార వీలునామా పత్రాన్ని వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌కు బుధవారం అందజేశారు. దీంతో ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు అతన్ని అభినందించారు. దేహదానం చాలా గొప్పదని, వైద్యవిద్యార్థులు వైద్య విద్యను బాగా నేర్చుకోవడానికి, అధ్యయనం చేయడానికి ఉపయోగపడుతుందని అన్నారు. ఎంఎన్‌ఓ నాగరాజు మాట్లాడుతూ.. తాను ఈ ఆస్పత్రిలోనే 33 ఏళ్ల పాటు పనిచేశానని, తన కుమారుడు కూడా ఇక్కడే వైద్యవిద్యార్థిగా చదువుకున్నాడని, ఈ కళాశాలకు కృతజ్ఞతగా తన దేహన్ని దానం చేస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో అనాటమీ విభాగం హెచ్‌ఓడీ ఉమామహేశ్వరరావు, పెథాలజీ హెచ్‌ఓడీ శివశంకరనాయక్, వైద్యులు మధుసూధన్, పరదేశీనాయుడు పాల్గొన్నారు.


ప్రిన్సిపాల్‌కు అంగీకారపత్రం అందజేస్తున్న ఎంఎన్‌ఓ

# బాబోయ్..! ఇదేం ఆస్పత్రి

- రేకుల షెడ్డులో బాలింతల కష్టాలు
- నీళ్లు రాక తీవ్ర ఇబ్బందులు
- కంపుకొడుతున్న బాత్రూమ్‌లు, మరుగుదొడ్లు
- మలమూత్ర విసర్జనకు వెళ్లలేని పరిస్థితి
- ఉక్కపోతతో అల్లాడిపోతున్న నవజాత శిశువులు
- అనంత పెద్దాసుపత్రిలో దారుణ పరిస్థితులు


బాలింతలు ఉన్న వార్డు

**అనంతపురం టౌన్**

పెద్దాస్పత్రిలో బాలింతల కోసం ఏర్పాటు చేసి ప్రత్యేక వార్డులో సరైన సౌకర్యాలు లేక వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని రోజులుగా ఈ వార్డుకు నీళ్లు రావడం లేదు. దీంతో అక్కడ ఉన్న బాత్రూమ్, మరుగుదొడ్డి కూడా గలీజుతో నిండిపోయాయి. అక్కడకు వెళ్లాలంటేనే కంపు కొడుతోంది. ఈవార్డును రేకులతో ఏర్పాటు చేయడంతో బాలింతలు, నవజాత శిశువులు ఉక్కపోతకు అల్లాడిపోతున్నారు. ఇక కరెంటు పోయిన సమయంలో వారికి ప్రత్యక్ష నరకమే. శిశువులను బతికించుకోవడం కోసం బాలింతల కుటుంబసభ్యులు ఆరు బయట చెట్ల కిందకు తీసుకొచ్చి లాలిస్తున్నారు. అయితే బాలింతలు, ముఖ్యంగా సిజేరియన్ చేయించుకున్న వారు మాత్రం వేడికి అల్లాడిపోతున్నారు.


వార్డులో ఉక్కపోతకు తట్టుకోలేక పసిబిడ్డలను చెట్లకిందకు తీసుకొచ్చి లాలిస్తున్న మహిళలు


రేకులషెడ్డులో ఉక్కపోతకు అల్లాడుతున్న బాలింతలు, శిశువులు

### మలమూత్ర విసర్జనకు వెళ్లాలంటే నరకమే



మల, మూత్ర విసర్జనకు వెళ్లేందుకు ఆవార్డులో ఉన్న బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాత్‌రూమ్‌కు వెళ్దామంటే అక్కడ నీళ్లు ఉండవు. ఒక వేళ జగ్గులో నీళ్లు తీసికెళితే అక్కడ మలము, మూత్ర వెళ్లే రంధ్రాలు మూసుకుపోయాయి. ఈక్రమంలో ఆ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతోంది. ఈ కష్టాలు అధికారులు, డాక్టర్లకు తెలిసినా కనీసం వారిపట్ల మానవత్వం చూపడం లేదనే విమర్శలు వినవస్తున్నాయి.

### నీళ్లులేవు, బాత్రూమ్ లేదు



మాది కంబదూరు మండలం. నాకూతురు డెలివరికీ ఇక్కడకు తీసుకొచ్చాం. కాన్పు అయిన తర్వాత ఈరేకుల షెడ్డుకు తీసుకొచ్చి పడేశారు. ఇక్కడ నీళ్ల లేవు, బాత్రూమ్‌లు లేవు. నాలుగురోజులుగా నానాఇబ్బందులు పడుతున్నాం, మాబాధలు ఎవరికి చెప్పుకోవాలో అర్థంకావడంలేదు.

\- చంద్రమ్మ, బాలింత తల్లి

### జగ్గులో నీళ్లు తీసుకెళ్తున్నా



నాకు సిజేరియన్ చేశారు. రెండురోజులు కిందట వార్డు నుంచి ఈ రేకుల షెడ్డు విభాగానికి పంపించారు. ఇక్కడ బాత్‌రూమ్‌లు లేవు. నీళ్ల ఉండటంలేదు. దీంతో మూత్రానికి పోయినా జగ్గులో నీళ్ల తీసుకొని పోతున్నా.

\- కళావతి, బాలింత, బుక్కరాయసముద్రం

### నీళ్లు కొంటున్నాం



ఇదేమి ఆస్పత్రో మాకు అర్థం కావడంలేదు. నీళ్ల లేవు. బాత్రూమ్‌లు లేవు. మూత్రశాలలకు వెళదామన్నా దుర్వాసన కొడుతున్నాయి. పైగా అంతా గలీజుగా ఉంది. కాలు పెట్టడానికికూడా మనసు రావడం లేదు. సారోళ్లకు, మేడమ్‌లకు చెబుతున్నా మాగోడు వినేవారేలేరు. నరకం అంటే ఏంటో ఇక్కడ చూస్తున్నాం.

\- సావిత్రమ్మ, నార్పల, బాలింత తల్లి

### అధికారులు స్పందించాలి..



సార్ ఇక్కడ బాలింతలు అనేక తిప్పలు పడుతున్నారు, నా కూతురుకు సిజేరియన్ చేశారు. రెం డురోజుల తర్వాత వార్డు నుంచి నడిపించుకుంటూ ఈరేకుల షెడ్డు వార్డుకు తీసుకొచ్చారు, ఇ క్కడకొస్తే నీళ్లలేవు, బాత్రూమ్‌లు లేవు. దూరంగా ఉ న్న మరోవార్డుకు వెళతున్నాం. సిజేరియన్ చేయించుకున్న బాలింతలు అంతదూరం ఎలా పోతారు సార్? కనీసం ఇక్కడ డాక్టర్లు మానవత్వం చూపరు, అధికారులు స్పందించాలి. బాలింతల కష్టాలు తీర్చాలి.

\- సిద్దమ్మ, హిందూపురం, బాలింత తల్లి


అనంతపురం: ఎంజే వెనుకభాగంలో మరమ్మతు పనులు


నగరంలో కూలిన స్తంభాలు, విరిగిన చెట్లు


విద్యుత్‌శాఖ ప్రధాన కార్యాలయం

# అతలాకుతలం..!

- అరగంట ఈదురుగాలులకు కూలిన విద్యుత్ స్తంభాలు
- ఉమ్మడి జిల్లాలో కరెంటు లేక ఒకటిన్నర రోజు ప్రజల ఇబ్బందులు
- బుధవారమూ కొనసాగిన విద్యుత్ స్తంభాల ఏర్పాటు.. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు
- ప్రీ మాన్‌సూన్ చెకప్ పట్ల విద్యుత్ శాఖ నిర్లక్ష్యం

**అనంతపురంరూరల్, మే 22:** ఈదురు గాలులు.. వర్ష బీభత్సానికి ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాలు అతలాకుతలం అయ్యాయి. పెద్ద పెద్ద వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ తీగలు తెగి వందల విద్యుత్ స్తంభాలను నేలమట్టమయ్యాయి. పదుల సంఖ్యలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోయాయి. దీంతో ప్రజలు ఒకటిన్నర రోజు పాటు కరెంటు లేక ఇబ్బందులు పడ్డారు. కొన్ని ప్రాంతాల్లో రెండు రోజుల పాటు విద్యుత్ సరఫరా లేదు. విద్యుత్‌శాఖ నిర్లక్ష్యమే ఇందుకు కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాలకు అనుగుణంగా విద్యుత్ చర్యలు చేపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నారే విమర్శలున్నాయి. వాస్తవానికి వర్షం కాలం వస్తోందంటేనే.. ప్రీమాన్ సూన్ చర్యలు చేపట్టాల్సి ఉంది. అయితే శాఖలోని అధికారులు వాటికి తిలోదకాలు ఇచ్చారని... ఏమాత్రం వాటి గురించి పట్టించుకోలేదనే వాదనలున్నాయి. ఎంత సేపు సంస్థ ఆదాయం గురించే తప్పా.. ఆ సంస్థ ఆదాయంలో బాగాస్వాములుగా ఉన్న వారికి సేవాలందించే విషయాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని వినియోగదారులు మండిపడుతున్నారు. గత రెండు రోజులుగా విద్యుత్ సరఫరాలో నెలకొన్న ఇబ్బందులే ఇందుకు నిదర్శనమంటున్నారు.

### రెండురోజులుగా ఇబ్బందులు...

ఈదురుగాలతో కూడిన వర్షానికి విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో ఉమ్మడి జిల్లాలోని పట్టణాలు, పలు గ్రామాలు చీకట్లో మగ్గుతున్నాయి. అనంతపురం జిల్లా కేంద్రంతోపాటు నగర శివారు ప్రాంతాలు, కళ్యాణదుర్గం, గుత్తి ప్రాంతాల్లో కరెంటు సమస్యతో జనాలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం అర్ధరాత్రి వరకు కరెంటు లేని కారణంగా చీకట్లో మగ్గిపోయారు. మరి కొన్ని ప్రాంతాల్లో బుధవారం కూడా ఈ ఇబ్బందులు కొనసాగాయి. ఉక్కపోత.. వేడితో జనం విలవిల్లాడిపోయారు. పిల్లలు, వృద్ధుల ఇబ్బందులు ఇక వర్ణనాతీతం. సమస్యలపై ఫిర్యాదు చేయడానికి వినియోగదారులు చేస్తున్న ఫోన్లతో విద్యుత్ అధికారులు ఫోన్లు, కార్యాలయాల ఫోన్లు మారుమ్రోగుతున్నాయి. ఫోన్ల తాకిడి.. విద్యుత్ కార్యాలయాల నెంబర్లు నిత్యం బిజీ.. బిజీ అంటూనే వస్తోంది. ఆ రీతిలో విద్యుత్ సమస్యలు నెలకొన్నాయి. కొన్ని ప్రాంతాల్లో చిన్న.. చిన్న మరమ్మత్తులతో కరెంటు సమస్య తీరేదీ. అయితే వాటి గురించి అటు విద్యుత్ అధికారులు.. ఇటు ఉద్యోగులు ఆరా తీసిన పాపాన పోలేదు. జిల్లా కేంద్రంలో ఈ ఇబ్బందులు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. సమస్యలను సమచార మాధ్యమాలు.. తెలియజేసినప్పటికీ వాటిని పట్టించుకోని పరిస్థితి నెలకొంది.

### ప్రీమాన్‌సూన్ చెకప్ పట్ల నిర్లక్ష్యం ..

సాధారణంగా విద్యుత్ అధికారులు, సిబ్బంది తమ పరిధిలోని విద్యుత్ సబ్‌స్టేషన్లు, లైన్లను తరచూ పరిశీలించాల్సి ఉంది. తద్వారా సమస్యలున్నా ప్రాంతాల్లో వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి. అయితే అధికారులు సబ్‌స్టేషన్లను తనిఖీ చేసింది.. మెయింటెనెన్స్ చేయించింది అంతంత మాత్రమే. కేవలం సమస్యలు వచ్చినప్పుడే మాత్రమే ఆయా ప్రాంతాల్లో పనులు చేయించి చేతులు దులుపుకొంటున్నారు. చాలా ప్రాంతాల్లో విద్యుత్ లైన్లను చెట్లు కమ్మేశాయి. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ముళ్లకంపలు, ఇతరాత్రవన్నీ పెరిగిపోయాయి. ప్రీమాన్ సూన్‌లో భాగంగా వాటిని చక్కబెట్టే పనులు చేయాల్సి ఉంది. అయితే ఆ పనులను ఏ మాత్రం చేపట్టలేదు. నిత్యం రెవెన్యూ కలెక్షన్లు.. అవీ.. ఇవీ అంటూ సంస్థలోని ఉన్నతాధికారులు చెప్పినవాటిని చేస్తున్నారే తప్పా.. ప్రజా సమస్యలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. రానున్నది వర్షాకాలం... ఇలాంటి ఈదురుగాలు.. వర్షాలు మరింత ఎక్కువ అయ్యే అవకాశాలున్నాయి. ఇప్పటికైనా విద్యుత్ సమస్యలు పరిష్కరించేలా అధికారులు, ఉద్యోగులు చొరవ చూపాలని వినియోగదారులు కోరుతున్నారు.

## ఏదో చేయబోతే.. మరేదో తేలింది

**గడ్డ తొలగించే ఆపరేషన్‌ను అర్ధంతరంగా ఆపిన వైద్యులు**

**ఆందోళన చెందుతున్న బాధితురాలు**


నారాయణమ్మ

**గుంతకల్లు, మే 22:** ఓ మహిళకు ఆపరేషన్ చేస్తూ మధ్యలోనే వదిలేసిన సంఘటన గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగింది. మండలంలోని ఓబుళాపురం గ్రామానికి చెందిన నారాయణమ్మ నుదిటిపై గడ్డలా ఓ బుడిపె ఏర్పడింది. ముఖంపై అది వికారంగా కనిపిస్తోందని తొలగించుకోవడానికి ఈ నెల 16న గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చింది. వైద్యుడు పరీక్షించి బయట సీటీ స్కానింగ్ చేయించుకుని రమ్మన్నాడు. నారాయణమ్మ అదేరోజున పట్టణంలోని శ్రీ సాయి మిత్ర డయాగ్నస్టిక్ సెంటరుకు వెళ్లి సీటీ స్కానింగ్ చేయించుకుని రిపోర్టు తెచ్చింది. రిపోర్టు, సీటీ స్కానింగ్ ఎక్స్‌రే చిత్రాలను పరిశీలించిన వైద్యుడు నుదిటిపైన గడ్డ ఉంది తొలగించాలి అంటూ మంగళవారం ఆపరేషన్ ప్రారంభించారు. చర్మం ఓపెన్ చేసిన తర్వాత అక్కడ గడ్డ కాకుండా ఎముక పెరిగి ఉందని చెప్పి ఆపరేషన్ చేయడానికి వీలు కాదని కుట్లువేసి మెడికల్ వార్డుకు తరలించారు. విషయం అర్థంకాక పేషెంట్ తరపు బంధువులు వైద్యులను ప్రశ్నించగా, సీటీ స్కాన్ రిపోర్టు ఇచ్చిన డయాగ్నస్టిక్ సెంటరు నిర్వాహకులు తప్పుడు రిపోర్టు ఇచ్చారన్నారు. గడ్డ ఉందని రిపోర్టు ఇవ్వగా, ఆపరేషన్ సమయంలో చర్మం తీసి చూస్తే గడ్డలేదని, ఎముక పెరిగిందన్న విషయం తెలిసిందని చెప్పారు. దీనికి తోడు పేషెంట్ అసలు అడ్మిషన్‌లో లేదని, అడ్మిట్ కాకుండా ఎలా ఆపరేషన్ చేయించుకున్నారని నర్సింగ్ సిబ్బంది సందేహం వ్యక్తం చేయడంతో బాధితురాలు, ఆమె కుటుంబీకులు ఆందోళనకు లోనయ్యారు. సీటీ స్కానింగ్ రిపోర్టును చూసి వైద్యులు సక్రమంగా అంచనా వేయలేకపోవడం ఏమిటని అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆసుపత్రి సూపరింటెండెంటు జయవర్ధన్‌రెడ్డిని వివరణ కోరగా వైద్యులది తప్పులేదన్నారు. డయాగ్నస్టిక్ సెంటరు వారు ఇచ్చిన రిపోర్టులో తప్పు ఉందని, తలపైన గడ్డ ఉందంటూ రిపోర్టు ఇచ్చారని, కానీ ఆపరేషన్ ప్రారంభించిన తర్వాత లోపల గడ్డ లేని విషయం బయటపడిందని, మెదడుతో సంబంధం ఉన్న ఎముక పెరిగిందని తెలిసి ఆపరేషన్‌ను ఆపినట్లు వివరించారు. ఓపెన్‌చేసిన చర్మానికి కుట్లువేసి పేషెంట్‌ను ఒకరోజు అబ్జర్వేషన్‌లో ఉంచి కర్నూలుకు రెఫర్ చేశారు.

## ఇంటర్ తత్కాల్ ఫీజు చెల్లింపునకు నేడే ఆఖరు

**అనంతపురం విద్య, మే 22:** ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫీజు చెల్లింపునకు గురువారం తత్కాల్ ఫీజు చెల్లించడానికి ఆఖరి గడువని ఆర్ఐఓ వెంకటరమణ నాయక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాధారణ ఫీజుకు అదనంగా తత్కాల్ కింద రూ. 3000 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ గడువు ఉందన్నారు.

### రేపటి నుంచి పరీక్షలు...

ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 34 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. ఫస్ట్ ఇయర్ జనరల్ విద్యార్థులు 15,921 మంది, ఒకేషనల్ విద్యార్థులు 980 మంది, సెకెండ్ ఇయర్ జనరల్ విద్యార్థులు 5,017 మంది, ఒకేషనల్ విద్యార్థులు 592 మంది పరీక్షలు రాయనున్నారు. మొత్తంగా 22,510 మంది విద్యార్థులు రాయనున్నారు. సప్లిమెంటరీ పరీక్ష పేపర్ల మూల్యాంకనం ఇకపై మాన్యువల్‌గా కాకుండా ఆన్‌లైన్ ద్వారా నిర్వహించేలా ఇంటర్ బోర్డు నిర్ణయం తీసుకుంది.

## బండిశిల తిరునాళ్లకు అనుమతుల నిరాకరణ


రామరాజుపల్లిలో బహిరంగ సభలో ప్రజలతో మాట్లాడుతున్న గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి

**పామిడి, మే 22:** ఈ ఏడాది బండిశిల తిరునాళ్లకు అధికారులు అనుమతులు నిరాకరించారు. మండలంలోని రామరాజుపల్లి గ్రామంలో బుధవారం సాయంత్రం రామరాజుపల్లి, పెద్దవడుగూరు మండలంలోని కాశేపల్లి, గుత్తి అనంతపురం గ్రామస్థులతో అధికారులు సమావేశమయ్యారు. ముందుగా గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు, పామిడి తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, సీఐ రాజశేఖర్‌రెడ్డి సుంకులమ్మ, ముత్యాలయ్య ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బండిశిల రథాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామస్థులతో సమావేశమయ్యారు. ప్రస్తుత శాంతిభద్రతలపై ప్రజలకు వివరించారు. ప్రజాభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఏడాది ఆనవాయితీగా వస్తున్న తిరునాళ్లను తప్పక జరిపించాలని ప్రజలు కోరారు. ఓట్ల లెక్కింపు తర్వాత జరిగేలా తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు ప్రజలకు తెలియజేసి వెనుదిరిగారు. పామిడిలోని తహసీల్దార్ కార్యాలయంలో రాత్రి ఆయా గ్రామాల పెద్దలతో అధికారులు తిరిగి చర్చలు జరిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉందని, శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని వివరించారు. ఇలాంటి తరుణంలో తిరునాళ్లకు అనుమతులు ఇవ్వడం కుదరదని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి సున్నితంగా పెద్దలకు వివరించారు. దీంతో చేసేదేమీలేక ఆయా గ్రామాల పెద్దలు నిరాశతో వెనుదిరిగారు.

### చీనీకాయలు టన్ను రూ.39 వేలు

**అనంతపురం రూరల్, మే 22:** అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.39 వేలు, కనిష్ఠంగా రూ.14 వేలు, సరాసరి రూ.24 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 754 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

**ఉన్నప్పుడు వదిలేసి..**

ఎన్నికల గొడవలపై పోలీసుల తీరిది

# అజ్ఞాతంలో వెళ్లాక వెతుకులాట..!


టీడీపీ నాయకుడిపై చేయి చేసుకుంటున్న ఎంపీపీ పురుషోత్తంరెడ్డి (ఫైల్)


టీడీపీ నాయకుడిపైకి దూసుకుపోతున్న వైసీపీ నాయకులు

**హిందూపురం, మే 22:** చిలమత్తూరు ఎంపీపీ పురుషోత్తం రెడ్డి పోలింగ్ రోజున వీరంగం సృష్టించాడు. వేరే పంచాయతీకి చెందిన తన అనుచరులను వెంటేసుకుని కవ్వింపు చర్యలకు పాల్పడ్డాడు. వీరాపురం పంచాయతీ పరిధిలోని హూస్సేన్‌పురంలో టీడీపీ నాయకుడు బాబురెడ్డిపై దాడికి పాల్పడ్డారు. బాబురెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేశారు. కనికెట్టిపల్లి, కొత్తచామలపల్లిలో కూడా గొడవలు సృష్టించారు. కానీ అధికార పార్టీ అభ్యర్థి, మరో ముఖ్యనేత అండ ఉండలంతో పురుషోత్తం రెడ్డిని అరెస్టు చేయకుండా వదిలేశారు. కానీ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల హింసపై సీఈసీ సీరియస్ కావడంతో పోలీసులు మేల్కొన్నారు. పురుషోత్తం రెడ్డిని అరెస్టు చేసేందుకు వారం రోజులుగా నాలుగు బృందాలతో గాలిస్తున్నారు.

### ఇరువర్గాలపై కేసులు

బాబురెడ్డిపై జరిగిన దాడి కేసులో ఎంపీపీతోపాటు వైసీపీకి చెందిన మరో 18 మందిపై కేసు నమోదు చేశారు. టీడీపీలో బాబురెడ్డితో పాటు మరో 18 మందిపై కూడా కేసు నమోదు చేశారు. నిందితులను పట్టుకునేందుకు సీఐ, ముగ్గురు ఎస్ఐలు.. తమ సిబ్బందితో నాలుగు బృందాలుగా ఏర్పడి వారం రోజులుగా కర్ణాటకలో గాలిస్తున్నారు. స్థానికంగా ఉన్న ఇరుపార్టీలకు చెందిన 14 మందిని మాత్రమే ఇప్పటి వరకు అరెస్టు చేశారు. పోలింగ్ రోజు వీరంగం సృష్టించిన ఎంపీపీని పోలీసులే రక్షిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఆయన స్థానికంగా అందుబాటులో ఉన్నప్పుడు అరెస్టు చేయకుండా.. అజ్ఞాతంలోకి వెళ్లి.. ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకున్నాక గాలింపు చర్యలు చేపట్టారు. ఆయన కదలికలపై పోలీసుల్లో కొందరికి సమాచారం ఉందని, అయినా పట్టుకోవడం లేదని అంటున్నారు. ఎంపీపీ ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. పోలింగ్ రోజున జరిగిన ఘర్షణకు సంబంధించి ఇరుపార్టీలకు చెందిన 38 మందిపై కేసులు నమోదు చేశామని డీఎస్పీ కంజక్షన్ అన్నారు. ఇప్పటి వరకు 14 మందిని అరెస్టు చేశామని, మిగిలిన వారిని ఒకటి రెండు రోజుల్లో పట్టుకుంటామని అన్నారు. ఈ కేసులను ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నారని, ఏ ఒక్కరినీ వదిలేది లేదని అన్నారు. ఈ కేసుల్లో వైసీపీ వర్గీయుల్లో పురుషోత్తంరెడ్డి, టీడీపీ వర్గీయుల్లో బాబురెడ్డి ఎ-1 నిందితులుగా ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో కళ్యాణదుర్గం మున్సిపల్ వైస్ చైర్మన్‌కు గాయాలు

**ముదిగుబ్బ, మే 22:** మండలంలోని ఎం.కొట్టాల సమీపంలో బుధవారం తెల్లవారుజామున కారు అదుపు తప్పి రోడ్డుపక్కకు దూసుకెళ్లడంతో నలుగురు గాయపడినట్లు పట్నం ఎస్ఐ నరసింహులు తెలిపారు. కళ్యాణదుర్గం మున్సిపల్ వైస్ చైర్మన్ ఫణీంద్ర మంగళవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి కళ్యాణదుర్గానికి తిరిగి వెళుతుండగా ముదిగుబ్బ మండలం ఎం.కొట్టాల సమీపంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఫణీంద్ర తీవ్రంగా, ఎర్రిస్వామి, ప్రేమ్‌కుమార్, దినేష్ స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఫణీంద్రను బెంగళూరుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.





ఉత్సవమూర్తులకు పుష్పాభిషేకం చేస్తున్న దామోదర గౌరంగదాస్, అలంకరణలో రాధాపార్థసారథులు

## వైభవంగా నృసింహ జయంతి

**అనంతపురం కల్చరల్, మే 22:** వైశాఖ శుద్ధ చతుర్దశిని పురస్కరించుకుని నగరశివారులోని ఇస్కాన్ మందిరంలో బుధవారం నృసింహ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి సమేత నృసింహస్వామి ఉత్సవమూర్తులకు ఇస్కాన్ మందిర చైర్మన్ దామోదర గౌరంగదాస్ ఫలపంచామృతాభిషేకాలు, పుష్పాభిషేకం నిర్వహించారు. అదేవిధంగా రాధాపార్థసారథులకు ప్రత్యేక అలంకరణలు చేసి.. పూజలు నిర్వహించారు. భక్తులు విరివిగా హాజరై స్వామివార్లను దర్శించుకున్నారు. మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం చేశారు.



వేడుకలను తిలకిస్తున్న భక్తులు



ఎంపికైన చెస్ క్రీడాకారులు

## జిల్లాస్థాయి చెస్ క్రీడాకారుల ఎంపిక

**అనంతపురం క్లాక్‌టవర్, మే 22:** స్థానిక సాయినగర్‌లోని ఏ1 ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ సెంటర్‌లో జిల్లా స్థాయి చెస్ సీనియర్ ఓపెన్, మహిళా క్రీడాకారులను బుధవారం ఎంపిక చేశారు. ఆల్ అనంతపురం చెస్ అసోసియేషన్, ఏ1 చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఓపెన్ సీనియర్ క్యాటగిరిలో ఎంపికైన రామసాయి, ఉదయ్‌కుమార్, కృష్ణసుధీంద్ర వెంకట సముద్రాల, కుశాల్ ఈనెల 27, 28 తేదీల్లో విజయ వాడలో నిర్వహించే ఏపీ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. అలాగే మహిళా క్యాటగిరిలో ఎంపికైన శ్రీహ, అస్మిత అనిమి, యశస్విని, భువనకృతి ఈనెల 25, 26 తేదీల్లో హిందూపురంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో చెస్ నేషనల్ ఆర్బిటార్లు మెహరాజ్, కాశీ రవీంద్ర, కిశోర్ పాల్గొన్నారు.

# మామిడి మోసాలు..!

- మార్కెట్లో రసాయనాలతో మాగిన మామిడిపండ్లు
- కాల్షియం కార్బైడ్ రసాయనంతో అనారోగ్యం
- ఫలితమివ్వని ఆహారభద్రత శాఖ అధికారుల తనిఖీలు
- అవగాహన సదస్సులు నిర్వహించినా రాని మార్పు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యనిపుణులు



**అనంతపురం ప్రెస్‌క్లబ్, మే 22:** కాసులు దండుకోవడమే పనిగా వ్యాపారులు, దళారులు మామిడిపండ్లు మాగడానికి కెమికల్స్ వాడుతూ ప్రజల ప్రాణాలతో చలగాటమాడుతున్నారు. ఆహారభద్రతశాఖాధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నా... మామిడి మోసాలు ఏ మాత్రం తగ్గడం లేదు. సాధారణంగా వేసవి అంటేనే మామిడి పళ్లు గుర్తుకొస్తాయి. ఎంత ఖర్చయినా సరే వెనకాడకుండా వాటిని కొనుగోలు చేస్తుంటాం. అయితే ఆ మామిడి పళ్లు సహజసిదధంగా మాగినవా..? లేక రసాయనాలతో మాగించినవా అనేది పట్టించుకోవడం లేదు. ఈ ఏడాది వర్షాభావం వల్ల మామిడి సాగు తగ్గింది. ఈ నేపథ్యంలోనే పలువురు దళారులు ఉన్న మామిడిపండ్లను కొనుగోలు చేసి వాటిని గడ్డిలో మాగనివ్వకుండా... కొన్ని రసాయనాలు ఉపయోగిస్తున్నారు. మూడు రోజుల్లోపే రంగు వచ్చేలా చేసి.. విక్రయించి.. సొమ్ము చేసుకొంటున్నారు. ప్రజలు వాటి కలర్‌ను చూసి కొనుగోలు చేసి తమ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఆహారభద్రతశాఖాధికారులు మార్కెట్ యార్డు అధికారులతో కలిసి ప్రజలకు, పలువురు వ్యాపారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా ఫలితం ఉండటం లేదు.



**ఆ పండ్లతో అనారోగ్యమే...**

రసాయనాలు వాడటంతో పక్వానికి వచ్చిన మామిడిపండ్ల తినడంలో అనారోగాలు కొనితెచ్చుకోవడమేనని పలువురు వైద్యులు సూచిస్తున్నారు. అలాంటి పండ్లు తినడం అనేక వ్యాధులు సంభవిస్తాయని అంటున్నారు. రసాయనాలు కలిగిన మామిడిపండ్లు తినడం వల్ల కేన్సర్ తదితర రోగాలు సోకే ప్రమాదం అధికంగా ఉంటుందన్నారు. మామిడిపండ్లు త్వరగా మాగడానికి ఉపయోగించే కాల్షియం కార్బైడ్ అనే రసాయనం నరాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. అలాంటి పండ్లు తినడం వల్ల తలనొప్పి, అలసట, అధికంగా నిద్రపోవడం, జ్ఞాపకశక్తి కోల్పోవడం తదితర సమస్యలు వస్తాయన్నారు. ముఖ్యంగా పాలిచ్చే తల్లులు ఇలాంటి పండ్లను తినడం వల్ల ఆ రసాయనాలు పిల్లలకు మరింత హానికరంగా మారే అవకాశం ఎక్కువగా ఉంటుందని, మామిడిపండ్ల విషయంలో జాగ్రత్త వహించాలని సూచిస్తున్నారు.



మామిడిపండ్లను పరిశీలిస్తున్న అధికారిణి

**గుర్తించడం ఎలా..?**

మార్కెట్లో కొనుగోలు చేసిన మామిడిపండ్లు సహజసిద్ధంగా మాగినవా.. లేక.. రసాయనాలతో మాగేసినవా అనేది ఈ విధంగా తెలుసుకోవచ్చు. ఒక బకెట్ నీటిలో ఆ పండ్లను వేస్తే నీటిలో మునిగితే అ సహజసిద్ధమైనవిగా... అవే నీటిపై తేలితే రసాయనాలు వాడినవిగా గుర్తించవచ్చు. రసాయనాలు వాడిన పండ్లు రంగు ఉన్నప్పటికీ.. వాటికి రుచి, రసం ఉండదు. మామిడి పండ్లకు కెమికల్ పౌడర్ చల్లితే.. దాని మొదలు చూస్తే ఆ భాగం పండదు. అలాగే దానిపై ఆకుపచ్చ, పసుపు పచ్చ చారలు కనిపిస్తాయి. అదే సహజంగా పండిన మామిడి పండు పైభాగంలో పసుపుపచ్చ రంగు చారలుగా కాకుండా ఏకరీతిగా ఉంటుంది. ఈ విధంగా మామిడిపండ్లను గుర్తించి కొనుగోలు చేయాలని ఆహారభద్రతశాఖాధికారులు సూచిస్తున్నారు.

**తనిఖీలు పెంచుతాం...**



మామిడిపండ్లలో కెమికల్స్ వాడకం వాస్తవ మే. దాదాపు నెల నుంచి పలు మామిడిపండ్ల దుకాణాలు, మార్కెట్ యార్డులో తనిఖీలు నిర్వహిస్తున్నాం. పలువురికి నోటీసులు అందించాం. కెమికల్స్ యూజ్ చేసిన మామిడి పండ్లను శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపాం. మార్కెట్‌యార్డులో పలువురు వ్యాపారులు, రైతులకు అవగాహన కల్పించాం. కొన్నిచోట్ల ఇంకా రసాయనాలు వాడుతున్నారు. వాటిపై తనిఖీలు పెంచి చర్యలు తీసుకుంటాం.

- కళ్యాణచక్రవర్తి, జిల్లా ఆహారభద్రతశాఖాధికారి

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

**అనంతపురం క్రైం, మే 22:** నగర శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ యువకుడు మరణించాడు. మంగళవారం రాత్రి అనంతపురం రూరల్ మండలం కామారుపల్లికి చెందిన వంశీ(20), ప్రశాంత్ బైక్‌లో అనంతపురం బయలుదేరారు. కురుగుంట వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో కిందపడిన వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కోలుకోలేక వంశీ బుధవారం మరణించాడు. అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### ఎస్పీ ఆకస్మిక తనిఖీ

**అనంతపురం క్రైం, మే 22:** జేఎన్టీయూలోని స్ట్రాంగ్ రూంల భద్రత, డయల్-100 విభాగం పోలీసుల పనితీరు, స్పందన అర్ధరాత్రి వేళ ఎలా నిర్వహిస్తున్నారు.. తదిత వాటిని ఎస్పీ గౌతమి శాలి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో స్ట్రాంగ్ రూంల వద్ద మూడంచెల భద్రతను ఎస్పీ చెక్ చేసి సమీక్షించారు. అనంతరం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని ఈ సర్వేలెన్స్ సెంటర్లో నిర్వహిస్తున్న డయల్-100 విభాగాన్ని తనిఖీ చేశారు. పోలీసుల సహాయం కోసం ప్రజలు/బాధితుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్‌పై సమీక్షించారు.

**జిల్లా వ్యాప్తంగా తనిఖీలు**

ఎస్పీ గౌతమి శాలి ఆదేశాలతో జిల్లాలో పోలీసులు బుధవారం కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లు చేశారు. పెద్దపప్పూరు మండలం ముచ్చుకోట, యల్లనూరు మండలం గొడ్డుమర్రి, గార్లదిన్నె మండలం సంజీవపురం, ఇటుకలపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కందకూరు, గుమ్మఘట్ట మండలం భూపసముద్రం, గుంతకల్లు పట్టణంలోని ఉమామహేశ్వర్‌నగర్, అనంతపురంలోని బిందెలకాలనీ, పామిడి పట్టణంలోని పలు సమస్యాత్మక కాలనీల్లో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లు చేశారు. పాతనేరస్తులు, ట్రబుల్ మాంగర్స్ రౌడీషీటర్లు, కర్ణాటక మద్యం, నాటుసారా నియంత్రణ కోసం పాత కేసుల్లోని వారి ఇళ్లల్లో తనిఖీలు చేశారు. ఈ ఆపరేషన్లలో ఇద్దరిని అరెస్టు చేసి 30 లీటర్ల నాటుసారా, రికార్డులు లేని ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

## నాణ్యమైన విత్తనాలనే అందించాలి



వేరుశనగ కాయలను పరిశీలిస్తున్న నాయకులు

**నార్పల, మే 22:** రైతుభరోసా కేంద్రాల్లో రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను 90 శాతం సబ్సిడీతో అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు డీ చిన్నయాదవ్ కోరారు. నార్పలలోని మూడో రైతు భరోసా కేంద్రంలో వేరుశనగ కాయలను బుధవారం పరిశీలించిన ఆయన మాట్లాడారు. వేరుశనగ కాయలు నాసిరకంగా ఉన్నాయని, కావున తక్షణమే రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని అన్నారు. వేరుశనగతో పాటు పత్తి, కంది, ఆముదం, మొక్కజొన్న తదితర అన్ని రకాలైన విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరతో రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గంగాధర, రైతు సంఘం మండల కార్యదర్శి లలితమ్మ, సహాయ కార్యదర్శి రమేష్, వ్యవసాయ సంఘం మండల కార్యదర్శి పెద్దపెద్దయ్య, సీపీఐ, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

### నాసిరకం పత్తివిత్తనాలు అరికట్టాలి

**అనంతపురం కల్చరల్, మే 22:** రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే పత్తివిత్తనాలు సరఫరా చేసి, నాసిరకం పత్తి విత్తనాలను అరికట్టాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో తాడిపత్రి, పామిడి, పెద్దవడుగూరు, గుత్తి, గుంతకల్లు, యాడికి, పుట్లూరు మండలాల్లో రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని కొన్ని కంపెనీలు, ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు కల్తీ నాసిరకం పత్తి విత్తనాలు, వ్యవసాయశాఖ బ్లాక్‌లిస్టులో పెట్టిన కొన్ని కంపెనీల విత్తనాలు సరఫరా చేస్తున్నాయన్నారు. వాటితో దిగుబడి రాక రైతులు కోట్లాది రూపాయల పెట్టుబడులు నష్టపోయి అప్పుల్లో కూరుకుపోతున్నారన్నారు. కాబట్టి ప్రభుత్వమే పత్తివిత్తనాలను రైతుభరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేయాలన్నారు.

### ఆరోగ్య శ్రీ పథకానికి నిధులు విడుదల చేయాలి

**అనంతపురం రూరల్, మే 22:** ఆరోగ్య శ్రీ పథకానికి నిధులు విడుదల చేసి.. ఆ పథకాన్ని అమలు చేయాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బీసీ ఆర్ దాస్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కురుగుంట కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... ఆరోగ్య శ్రీ పథకాన్ని నిలిపివేయడం... నిరుపేదలకు వైద్య సేవలు దక్కకుండా చేయడమేనని అన్నారు. ఇలాంటి పథకానికి ప్రభుత్వం నిధులు విడుదల చేయకుండా దుర్మార్గంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు.

### ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు

**అనంతపురం సెంట్రల్, మే 22:** పదో తరగతి విద్యార్థులకు శనివారం నుంచి ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణా తరగతులు నిర్వహిస్తామని అనంతపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి బుధవారం ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాస్/ఫెయిల్ అయిన విద్యార్థులు అర్హులని, భవిష్యత్తులో ఎలాంటి కోర్సులు తీసుకోవాలన్నా ప్రణాళికపై నిపుణులు సలహాలు ఇస్తారని అన్నారు. ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 90594 49772ను సంప్రదించాలని సూచించారు.

### 111 మంది బైండోవర్

**గార్లదిన్నె, మే 22:** మండలంలోని బూదేడు, సంజీవపురం, పెనకచెర్ల, డ్యాం, మర్తాడు, కోటంక, ముకుందాపురం, పీ. కొత్తపల్లి, కల్లూరు, కేశవాపురం, ఇల్లూరు, యర్రగుంట్ల, కొప్పలకొండ గ్రామాల్లో టీడీపీ, వైసీపీ పార్టీలకు చెందిన 111 మందిని బుధవారం బైండోవర్ చేసినట్లు ఎస్ఐ మహమ్మద్‌గౌస్ బాషా తెలిపారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల నేపథ్యంలో మండలంలోని ఎలాంటి ఘర్షణలూ తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా వీరిని బైండోవర్ చేసి తహసీల్దార్ లోకేశ్వరీ ముందు హాజరుపరిచినట్లు తెలిపారు.

## పోలింగ్ సరళిపై దగ్గుపాటి చర్చలు



పోలింగ్ సరళిపై చర్చిస్తున్న వెంకటశివుడు యాదవ్, దగ్గుపాటి

**అనంతపురం అర్బన్, మే 22 :** అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఎన్నికల పోలింగ్ సరళిపై కూటమి అనంత అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ నాయకులతో చర్చించారు. బుధవారం స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, ఇతర నాయకులతో ఆయన చర్చించారు. దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ... విద్యావంతులు, ఉద్యోగులు 90 శాతం మంది వైసీపీకి వ్యతిరేకంగా ఓటు వేశారని, వైసీపీ నాయకుల ప్రలోభాలను ప్రజలు తిప్పి కొట్టారని అన్నారు. వెంకటశివుడు యాదవ్ మాట్లాడుతూ.. ఓడిపోతామని తెలిసినా పోలింగ్ తర్వాత కూడా వైసీపీ నాయకులు మేకపోతు గాంబీర్యం ప్రదర్శిస్తున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొండవీటి సుధాకర్ నాయుడు, లక్ష్మీనరసింహ, కురబ నారాయణ స్వామి, విశ్వనాథ్, జోగి రాజేంద్ర పాల్గొన్నారు.

**ఆర్థిక సాయం అందజేత**

గుత్తి మండలం బాచుపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మరణించిన విషయం తెల్సిందే. స్థానిక రాణినగర్‌లోని బాధిత కుటుంబాన్ని దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ బుధవారం పరామర్శించారు. రూ.25 వేలు ఆర్థిక సాయం చేశారు. మృతి చెందిన ఒక్కొక్కరికి రూ. 20 లక్షల చొప్పున బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

## పుస్తకాలు అమ్మే స్కూళ్లను సీజ్ చేయాలి

**అనంతపురం విద్య, మే 22:** నిబంధనలు పాటించకుండా ముందస్తు అడ్మిషన్లు చేస్తూ... పుస్తకాలు ముద్రించి సొమ్ము చేసుకుంటున్న స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు కళ్యాణదుర్గం బైపాస్‌లోని ఓ కార్పొరేట్ స్కూల్ వద్ద వారు ఆందోళన చేపట్టారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమణయ్య, ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్ మాట్లాడుతూ... విద్యాసం వత్సరం ప్రారంభం కాకముందే... చాలా స్కూళ్లు ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నాయన్నారు. నగరంలోని పలు చోట్ల పలు విద్యాసంస్థల్లో హౌస్‌ఫుల్ బోర్డులు పెట్టాయన్నారు. ఒక్కో క్లాస్‌కు రూ. 8 వేల నుంచి రూ. 12 వేల వరకూ పుస్తకాలకు ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. స్కూల్ పేరుతో ముద్రించిన పాఠ్యపుస్తకాలు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ఎంఈఓ వెంకటస్వామికి ఫిర్యాదు చేసినా... ఆ విద్యా సంస్థలపై ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదన్నారు. స్పందించని విద్యాశాఖాధికారులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు మంజునాథ్, ఉమామహేష్, వంశీ, సిద్దు, భీమేష్ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

### సాఫ్ట్‌బాల్ జట్టుకు అభినందన

**అనంతపురం క్లాక్‌టవర్, మే 22 :** బెంగుళూరులో ఇటీవల నిర్వహించిన జాతీయ ఇంటర్ యూనివర్శిటీ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఎస్కేయూ జట్టు మొదటి స్థానం నిలిచి... బంగారు పతకం సాధించింది. దీంతో ఆ జట్టు సభ్యులను ఎస్కే విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ హుస్సేన్‌రెడ్డి బుధవారం పతకాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఎస్కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ శ్రీనివాసన్, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర సీఈఓ వెంకటేశులు, కార్యదర్శి నాగేంద్ర, సభ్యులు పాల్గొన్నారు.



జట్టును అభినందిస్తున్న ఎస్కేయూ వీసీ

### వీధి వ్యాపారులకు గొడుగుల పంపిణీ

**అనంతపురం క్లాక్‌టవర్, మే 22 :** నగరంలోని పలు ప్రాంతాల్లో వీధి వ్యాపారులకు బుధవారం ఉచితంగా గొడుగులు అందజేశారు. అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బాలచందర్ స్వామీజీ సహకారంతో ప్రగతిపథం యూత్ అసోసియేషన్, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో వాటిని పంపిణీ చేశారు. కేంద్రప్రభుత్వ మైగవ్ అంబాసిడర్ బిసాటి భరత్, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకుడు, అర్బన్ బ్యాంకు డైరెక్టర్ సుంకర రమేష్ మాట్లాడుతూ.. ఒక్కో గొడుగు విలువ రూ. 600 అని, బుధవారం సుమారు 80 మందికి వాటిని పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ ఎస్ఎస్ రాష్ట్ర అవార్డు గ్రహీత నందిత, రైవర్ కాలేజీ కో-ఆర్డినేటర్ కిరణ్‌సాయి, ప్రగతి పథం యూత్ అసోసియేషన్ కార్యదర్శి పవన్, సభ్యులు పాల్గొన్నారు.

### శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

**గార్లదిన్నె, మే 22:** వేసవి సెలవుల్లో గ్రంథాలయాల్లో నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాలను పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ సంయుక్త కార్యదర్శి రమ సూచించారు. స్థానిక గ్రంథాలయ కార్యాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని బుధవారం పరిశీలించిన ఆమె మాట్లాడారు. పిల్లలు వేసవి సెలవు ల్లో సమయాన్ని వృథా చేయకుండా ఉండేందుకు ఏటా గ్రంథాలయాల్లో శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నా మన్నారు. ఈ శిబిరాల్లో పిల్లలకు ఆటలు, పాటలు, కథలు, చిత్రలేఖనం తదితర వాటిని నిర్వహించి ప్రోత్సహిస్తున్నా మన్నారు. ఆమె వెంట గ్రంథాలయ అధికారి శిరీష ఉన్నారు.



శిక్షణ శిబిరాన్ని పరిశీలిస్తున్న రమ

### వర్షం వచ్చినా స్ట్రాంగ్ రూమ్స్ తడవరాదు: కలెక్టర్

**అనంతపురం టౌన్, మే 22:** వర్షం వచ్చినా స్ట్రాంగ్ రూమ్స్‌లోకి ఒక చుక్కనీరు పోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టరు వినోద్ కుమార్ ఆదేశించారు. బుధవారం జేఎన్‌టీయూలోని స్ట్రాంగ్ రూమ్స్‌ను ఆయన పరిశీలించారు. ప్రతి స్ట్రాంగ్ రూమ్స్ పైనా వర్షం వచ్చినా కారుకుండా టార్పాలిన్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. వచ్చే 4,5 తేదీల్లో భారీ వర్షాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని, వర్షపు నీరు స్ట్రాంగ్ రూమ్స్‌లోకి వెళ్లకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని అన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లపైనా ఎలాంటి రాళ్లు, మట్టి లేకుండా చూడాలని, ప్రతి స్ట్రాంగ్ రూమ్ ఎదుట లైట్లు, గట్టి భద్రత ఏర్పాటు చేయాలని అన్నారు. ఆయన వెంట ఆర్‌ఓ రాంభూపాల్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్‌ఈ ఓబులరెడ్డి, ఈఈ ప్రసాద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టరు



టీడీపీ నాయకులతో చర్చిస్తున్న మాజీ మంత్రి పరిటాల సునీత

## టీడీపీ, జనసేన నాయకులతో సమీక్ష

**రామగిరి, మే 22:** రాప్తాడు నియోజకవర్గంలో జరిగిన ఓటింగ్ సరళిపై మాజీ మంత్రి పరిటాల సునీత బుధవారం జనసేన నాయకులు, పలు మండలాల నుంచి వచ్చిన టీడీపీ నాయకులతో సమీక్షించారు. జనసేన నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారంలో చురుకుగా పాల్గొనడంపై అభినందించారు. వారివారి గ్రామాలలో జరిగిన పలు విషయాలపై మాట్లాడారు. టీడీపీ అధికారంలోకి రాగానే గ్రామాల అభివృద్ధి, సమస్యలపై దృష్టిసారిద్దామని ఆమె తెలిపారు. పరిటాల సునీత గెలుపుపై జనసేన నాయకులు, కార్యకర్తలు ధీమా వ్యక్తం చేశారు.

### పోస్టల్ బ్యాలెట్లకు ఎక్కువ టేబుల్స్ ఏర్పాటు చేయాలి

**అనంతపురం అర్బన్, మే 22 :** పోస్టల్ బ్యాలెట్‌లో ప్రతి 500 ఓట్లకు ఒక టేబుల్ ఏర్పాటు చేయాలని అనంతపురం నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటేశ్‌ను టీడీపీ రాష్ట్ర నాయకులు గాజుల ఆదెన్న కోరారు. బుధవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి వినతి పత్రం అందజేశారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం ప్రతి సారి ఎక్కువ సమయం పడుతోందని, ఈ సారి ఆ పరిస్థితి తలెత్తకుండా ఎక్కువ టేబుల్స్ ఏర్పాటు చేయాలని కోరారు. తద్వారా అన్ని పార్టీల లకు ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. ఓట్ల లెక్కింపులో ఎలాంటి పొరపాట్లు లేకుండా చేయాలంటే ఇలాంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డికి ఆయన వినతి పత్రం అందజేశారు.



వినతి పత్రం ఇస్తున్న గాజుల ఆదెన్న

### కొనసాగిన రైతుల పేర్ల రిజిస్ట్రేషన్

**అనంతపురం అర్బన్, మే 22 :** జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల్లో విత్తన వేరుశనగ కోసం రైతుల పేర్లు రిజిస్ట్రేషన్ ప్రక్రియ నాలుగో రోజైన బుధవారమూ కొనసాగింది. ఇప్పటి దాకా 31,555 మంది రైతులు 27,868 క్వింటాళ్ల కోసం పేర్లు నమోదు చేసుకున్నారు.

### ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

**నార్పల, మే 22:** స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్‌లోని 19 మంది తృతీయ సంవత్సరం విద్యార్థులకు పలు కంపెనీల్లో ఉద్యోగాలు లభించాయి. మెకానికల్ శాఖలో 11మంది, ఎలక్ట్రికల్ విభాగంలో 8 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఆ విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో బుధవారం నియామక పత్రాలు అందజేశారు. ప్రిన్సిపాల్ ఆర్ డేవిడ్ అధ్యక్షత నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ డీఈ లక్ష్మీనారాయణ ఆ విద్యార్థులకు నియామక పత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ హెడ్ అశోక్‌రామన్, ప్లేస్మెంట్ అధికారి పాల్గొన్నారు.

### దేవాలయ ఆవుల అపహరణ

**గార్లదిన్నె :** మండలంలోని కల్లూరులో వెంకటేశ్వరస్వామి దేవాలయానికి సంబంధించిన రెండు ఆవులు అపహరణకు గురయ్యాయి. స్వామి వారికి మొక్కుబడుల కోసం గ్రామంలో ఇద్దరు దాతలు రెండు ఆవులను స్వామివారి పేరిట గ్రామంలో వదిలారు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు వాటిని ఎత్తుకెళ్లారు. బుధవారం ఆవులు కనిపించకపోవడంతో ఆలయ కమిటీ సభ్యులు గార్లదిన్నె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## సూర్యప్రభ వాహనంపై వేంకటరమణస్వామి


సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

**రాయదుర్గం రూరల్, మే 22:** పట్టణంలో వెలసిన ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం సూర్యప్రభ వాహనంపై స్వామివారు ఊరేగారు. స్వామివారికి ఉదయాన్నే గంగపూజ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, పుష్పాలంకరణ, వస్త్రాలంకరణ, నైవేద్యసేవ, తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం వేళలో అందంగా అలంకరించిన సూర్యప్రభ వాహనంపై స్వామివారు ఆశీనులై దేవాలయం నుండి తేరుబజార్, వినాయకసర్కిల్ మీదుగా పాతబస్టాండ్, లక్ష్మీబజార్ మీదుగా ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

## శాంతిభద్రతలపై సమీక్ష

**బొమ్మనహాళ్, మే 22:** మండలంలో శాంతిభద్రతల విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ రామాంజినమ్మ, ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం వారు వీఆర్వోలు, వీఆర్ఏలు, పోలీస్‌సిబ్బందితో శాంతిభద్రతలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని కౌంటింగ్ పూర్తి అయినా జూన్ 25 వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. గ్రామాలలో అనుమతులు లేకుండా సమావేశాలు ఏర్పాటు చేసినా, ఏవైనా గొడవలు జరిగినా తమ దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. గెలుపు, ఓటములపై గొడవలు జరిగే ఆస్కారం ఉందని గ్రామాలలో జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డి ప్యూటీ తహశీల్దార్ సుజాత, వీఆర్వోలు నరసింహమూర్తి, సుజాత, యుగంధర్, శృతి, రామన్న, రవి, పోలీస్‌సిబ్బంది తిమ్మప్ప, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జాతరను జాగ్రత్తగా నిర్వహించుకోండి: ఆర్డీఓ


గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

**పుట్లూరు, మే22:** మండలంలోని మడ్డిపల్లి గ్రామంలో అంకాలమ్మ జాతరను జాగ్రత్తగా నిర్వహించుకోవాలని ఆర్డీఓ వెంకటేష్ తెలిపారు. గ్రామ పెద్దలతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. జాతరలో మైకసెట్లు, డీజేలు, ఊరేగింపులు లేకుండా పూజలు మాత్రమే నిర్వహించుకోవాలన్నారు. 144సెక్షన్ అమలులో ఉండటంతో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా అందరూ సహకరించాలని కోరారు. ఆయన వెంట తహసీల్దార్ మల్లికార్జునస్వామి, ఎస్ఐ హేమాద్రి, సిబ్బంది ఉన్నారు.

## నేలకొరిగిన పత్తి మొక్కలు


నేలకొరిగిన పత్తి మొక్కలను చూపిస్తున్న రైతు

**బొమ్మనహాళ్, మే 22:** గాలీ వాన దెబ్బకు చేతికొస్తున్న దశలో పత్తి మొక్కలు నేలకొరిగాయి. చక్కని పూతతో కీలకదశలో ఉన్న పత్తి పంటకు పూత రాలుతోంది. పత్తి మొక్కలు గాలికి విరిగి నేలకొరిగాయి. మండలంలో మూడు రోజులుగా కురిసిన గాలీవానకు పత్తిపంటలు నేలకొరిగాయి. మండలంలో గొనూరు, శ్రీధరఘట్ట, ఉద్దేహాళ్ తదితర గ్రామాలలో పత్తి సాగు చేశారు. భారీ వర్షాలకు పొలాల్లో నీరు నిల్వ ఉండటంతో మొక్కల వేర్లు కుళ్లిపోతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఈ వర్షం ధాటికి 30 శాతం దిగుబడి కూడా అనుమానమేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తిసాగుకు ఎకరాకు రూ. 25 వేల నుంచి రూ. 30 వేల దాకా పెట్టుబడి కోసం ఖర్చు అవుతుంది. ఎకరాకు 12 నుంచి క్వింటాళ్ల దాకా దిగుబడి వస్తే రైతులకు లాభాలు ఉంటాయి. ఇప్పుడు కురిసిన వర్షాల కారణంగా ఎకరానికి రెండు, మూడు క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

## ఇద్దరిపై కేసు నమోదు

**యాడికి, మే22:** స్థలం విషయమై చౌడమ్మ అనే మహిళను తోసేసిన సంఘటనలో ప్రభాకర్‌రెడ్డి, బండారు బాల అనే ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలమేరకు చౌడమ్మ అనే మహిళ 1998లో యాడికిలో 51సెంట్లు స్థలం కొనుగోలు చేసింది. ఈ స్థలం పక్కనే ఉన్న ప్రభాకర్‌రెడ్డి, బండారు బాల అనే ఇద్దరు వ్యక్తులు తన స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారని ఆమె తెలిపింది. స్థలం వద్దకు వెళ్లిన తనను ఇద్దరు వ్యక్తులు తోసేసినట్లు చౌడమ్మ ఫిర్యాదు ఇచ్చిందని తెలిపారు. చౌడమ్మ ఫిర్యాదుమేరకు ప్రభాకర్‌రెడ్డి, బండారు బాలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# ప్రజలకు అందుబాటులో ఉండండి

### అధికారులకు కలెక్టర్ ఆదేశం


వేల్పుమడుగు గ్రామస్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

**విడపనకల్లు, మే 22:** మండల రెవెన్యూ అధికారులు నిత్యం రైతులు, ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని వేల్పుమడుగు, విడపనకల్లు గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ముందుగా వేల్పుమడుగు గ్రామంలోని సుంకులమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. గ్రామంలో గురువారం జరిగే సుంకులమ్మ దేవి ముత్యాలపల్లకి ఉత్సవం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కోడ్ ఉన్నందున గ్రామంలో ఎలాంటి అల్లర్లకు తావు లేకుండా చూడాలని గ్రామ సర్పంచ్ తిప్పారెడ్డితో పాటు గ్రామ పెద్దలకు సూచించారు. అనంతరం విడపనకల్లు తహసీల్దారు కార్యాలయం చేరుకుని తనిఖీలు చేశారు. సీపీఐ నాయకుడు ఎంబీ చెన్నరాయుడు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. విడపనకల్లు తహసీల్దారు ఎన్నికలు నిర్వహించేందుకు మాత్రమే వచ్చానని, ఇతర పనులు ఏవి చేయను అంటూ మండల ప్రజలను ఇబ్బంది పెడుతున్నాడని ఫిర్యాదు చేశారు. రైతులు బ్యాంకుల్లో రుణాలు రెన్యువల్ కోసం తహసీల్దారు కార్యాలయానికి వచ్చి వన్‌బీలు రాక ఇబ్బందులు పడుతున్నా ఎవరు పట్టించుకోవటం లేదని ఫిర్యాదు చేశారు. విద్యార్థులకు కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకుండా కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని పేర్కొన్నారు. విడపనకల్లు రైతులు వన్‌బీ అడంగల్ కోసం గుంతకల్లు, ఉరవకొండకు వెళ్లి తీసుకొని రావాల్సి వస్తోంది అని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ మండలంపై అధికారులు అందరికి పట్టు ఉండాలన్నారు. కార్యాలయంలో రికార్డులను పక్కాగా నిర్వహించాన్నారు. తహసీల్దారు కార్యాలయం ద్వారా ప్రజలకు అవసరమైన అన్ని సేవలను ఎప్పటికప్పుడు అందించాలన్నారు. తహసీల్దారు కార్యాలయ ప్రాంగణం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, కార్యాలయంలో సిటీజన్ చార్టు ఏర్పాటు చేయాలని, ఎలాంటి సేవలు అందిస్తున్నారు అనే వివరాలు ప్రజలకు తెలియ జేయాలని ఆదేశించారు. అనంతరం రికార్డులను పరిశీలించి సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దారు దస్తగిరయ్య, ఎంపీడీఓ కొండయ్య, డీటీ బసవకుమార్, రీసర్వే డీటీ వెంకటేశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## యువతి ఆత్మహత్య


**పుట్లూరు, మే22:** మండలంలోని మడ్డిపల్లి గ్రామానికి చెందిన బూజుల ఇందు (18) అనారోగ్యంతో బుధవారం ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈమె గత కొన్నేళ్లుగా శ్వాసకోశ వ్యాధితో బాధపడుతుండేది. పలు ఆసుపత్రుల్లో చూపించినా ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది తెల్లవారుజామున అందరూ బయట నిద్రిస్తుండగా ఇంటిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తల్లిదండ్రులు లేచిచూసేసరికి మృతి చెందింది. మృతురాలు తాడిపత్రిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోంది. తండ్రి రామచంద్రారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**గుత్తి, మే 22:** పట్టణ శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. పెద్దవడుగూరుకు చెందిన శ్రీనివాస శర్మ, వంశీలు తన ద్విచక్రవాహనంపై గుత్తికి వస్తుండగా పట్టణ శివారులోని ఓ పెట్రోల్ బంక్ మలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాసశర్మ, వంశీలు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

- మాజీ ఎమ్మెల్సీ గేయానంద్



సదస్సులో మాట్లాడుతున్న గేయానంద్

**కళ్యాణదుర్గంరూరల్, మే 22:** విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవరుచుకోవాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ విద్యార్థులకు సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మూఢనమ్మకాలు- శాస్త్రీయ విశ్లేషణ అనే అంశం పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మన సమాజంలో నెలకొన్న మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా, సైన్స్ పట్ల విద్యార్థులు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా గౌరవ సలహాదారులు మల్లికార్జున, జేవీవీ జిల్లా ఉపాధ్యక్షులు, సభ్యులు లక్ష్మీనారాయణ, కంబాల తిమ్మారెడ్డి, నందన్‌రెడ్డి, శ్రీనివాసనాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

### అల్లర్లు, గొడవల జోలికి వెళ్లకండి

**యాడికి, మే22:** అల్లర్లు, గొడవల జోలికి వెళితే కఠిన చర్యలు తప్పవని సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని కోనుప్పలపాడు గ్రామంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందితో నాకాబందీ నిర్వహించారు. గ్రామంలోని పలువురు నాయకులు, సమస్యాత్మక వ్యక్తుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించినా, అసాంఘిక కార్యకలాపాలు ఎవరైనా నిర్వహించినా తమకు సమాచారం అందించాలన్నారు.

### నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

**పెద్దవడుగూరు, మే22:** నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఏడీ వెంకటరాముడు, వ్యవసాయ అధికారి మల్లేశ్వరి తెలిపారు. మండలకేంద్రంలోని ఎరువుల దుకాణాలను బుధవారం వారు తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. నాణ్యమైన విత్తనాలనే రైతులకు విక్రయించాలన్నారు. వేరుశనగ విత్తనాలు కావాల్సిన రైతులు రైతు భరోసాకేంద్రాల్లో సంప్రదించాలని వారు కోరారు.

### గ్రామస్థులతో ఆర్డీఓ సమావేశం

**యల్లనూరు, మే22:** ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో గ్రామాల్లో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టరాదని అనంతపురం ఆర్డీఓ వెంకటేష్ పేర్కొన్నారు. బుధవారం ఆయన యల్లనూరు, పాతపల్లి, లింగారెడ్డిపల్లి గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఈ గ్రామాల్లో పౌర్ణమి వేడుకలను గుంపులు గుంపులుగా ఉండి నిర్వహించుకోరాదన్నారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేవరకు 144సెక్షన్ అమలులో ఉన్నందున ఎక్కడ గొడవలకు ఆస్కారం ఇవ్వరాదని తెలియజేశారు. ఆయన వెంట యల్లనూరు తహశీల్దార్ జయప్రసాద్, ఎస్ఐ గిరిబాబు ఉన్నారు.

### నరసింహ హోమం

**గుంతకల్లుటౌన్,మే22:** పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీ మాత జయంతి ఉత్సవాలలో భాగంగా బుధవారం నరసింహ హోమం నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్టుకు పుష్పాలంకరణ చేసి ప్రత్యేక పూజలను నిర్వహించారు. సుదర్శన చక్రానికి అభిషేకం, నరసింహ హోమం పూర్ణాహుతి, మహామంగళ హారతి ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. సాయంత్రం విజయ విట్టల భజన మండల సభ్యులచే శ్రీ పురంధరదాసు కీర్తనలు ఆలాపించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### పల్లెల్లో అధ్వానంగా వీధిలైట్ల వ్యవస్థ

**రాయదుర్గంరూరల్, మే 22:** పల్లెల్లో వీధిలైట్ల వ్యవస్థ అధ్వానంగా ఉన్నా, అధికారులు పట్టించుకోవడం లేదని ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాల యంలో బుధవారం ఎంపీపీ విద్యావతి అధ్యక్షతన ఎంపీడీఓ అల్లాబకాష్ ఆధ్వర్యంలో మండల సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సమస్య గాని తలెత్తితే వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను కోరారు. మండలంలో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ నిధులు జమ అయినట్లు తెలిపారు. అనంతరం ప్రజా ప్రతినిధులు పలువురు స్థానిక సమస్యలపై అధికారులను ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచులు, ఏఓ చిక్కణ్ణ, ఈఓపీఆర్డీ రంగనాయకులు, ఏఓ మహేంద్ర, ఎంఈఓ 2 వెంకటరమేష్, పశువైద్యులు సూర్యనారాయణరెడ్డి, వైద్యులు మాధవ్‌మోహన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు వేణుగోపాల్‌రెడ్డి, భీమేష్, శ్రీదేవి, అశోక్ పాల్గొన్నారు.

### ఇద్దరికి జిల్లా బహిష్కరణ

**కళ్యాణదుర్గం, మే 22:** కంబదూరు మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఇద్దరు వ్యక్తులను జిల్లా నుంచి బహిష్కరించినట్లు ఎస్ఐ ఆంజనేయులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కంబదూరు మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులను మూడు నెలల పాటు జిల్లా బహిష్కరణ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఆ ఇద్దరిపై కంబదూరు పోలీస్ స్టేషన్‌లో పలు కేసులు నమోదయ్యాయన్నారు.

### శాంతియుతంగా ఉత్సవాలు జరుపుకోవాలి

**బెళుగుప్ప, మే 22:** ఎన్నికల దృష్ట్యా గొడవలకు పోకుండా శాంతియుతంగా ఉత్సవాలు జరుపుకోవాలని జడ్పీ సీఈవో వైఖోమ్ నిదియా దేవి సూచించారు. మండల కేంద్రంలో ఈ నెల 24 నుంచి ఎర్రితాత ఉత్సవాలు జరుగుతుండగా ఆమె ఎంపీడీవో సుబ్బరాజు, ఎస్ఐ శివతో కలసి ఆలయాన్ని పరిశీలించారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు.

### పిడుగుపాటుకు 10 గొర్రెలు మృతి

**బొమ్మనహాళ్, మే 22:** దర్గాహొన్నూరు శివారులో మంగళవారం అర్ధరాత్రి పిడుగుపాటుతో పది గొర్రెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన నెరమెట్ల బోయ వన్నూరుస్వామి, కురుబ వన్నప్ప, కురుబ ముద్దప్పలకు చెందిన 10 గొర్రెలు మృతి చెందినట్లు తెలిపారు. దీంతో దాదాపు రూ. లక్షకుపైగా నష్టం జరిగినట్లు బాధితులు వాపోయారు.

## ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

**రాయదుర్గం రూరల్, మే 22:** మండలంలోని మల్లాపురం గ్రామంలో వెలసిన విశ్రమలై లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో బుధవారం లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి సుప్రభాసేవ, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, ఆకులపూజ, నైవేద్యపూజలు నిర్వహించారు. అనంతరం 12 గంటలకు శ్రీవారి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు బీఎన్ తిప్పేస్వామి, ఉపాధ్యక్షులు ధర్మన్న, కోశాధికారి నరసింహులు, ఉప కోశాధికారి ఎస్ఆర్ఎస్ సత్యనారాయణ, కార్యదర్శి గురురాఘవేంద్రప్రసాద్, సభ్యులు గురునాథరెడ్డి, రామిరెడ్డి, వెంకటరెడ్డి, తిప్పేస్వామి, నరసింహులు పాల్గొన్నారు.

### కుందుర్పిలో..


అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

**కుందుర్పి:** మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి మొక్కులు తీర్చుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను గ్రామ వీధుల్లో ఊరేగించారు.

### యల్లనూరులో..



**యల్లనూరు:** మండలకేంద్రంలో బుధవారం లక్ష్మీనరసింహస్వామి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం అభిషేక పూజలు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో గ్రామంలో స్వామివారి ఊరేగింపుకు అనుమతి నిరాకరించారు.

## ఇసుక తవ్వకాలపై నిఘా ఉంచండి: ఆర్డీఓ

**కళ్యాణదుర్గం, మే 22:** రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఇసుక తవ్వకాలు, గనుల నిర్వహణపై ప్రత్యేక నిఘా ఉంచి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్డీఓ సుష్మిత ఆయా మండలాల తహసీల్దార్లు, సర్వేయర్లను ఆదేశించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం ఆమె డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, మండల సర్వేయర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. శాంతిభద్రతలు పటిష్టంగా అమలు చేయాలన్నారు. కర్ణాటక సరిహద్దు మండలాల్లో పనిచేస్తున్న తహసీల్దార్ల పనితీరు పక్కాగా ఉండాలని, సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పనితీరు మెరుగుపరచడానికి అందరూ వ్యక్తిగత రిజిస్టర్లు ఉపయోగించాలన్నారు. కౌంటింగ్ ముగిసే వరకు ఆయా మండలాల తహసీల్దార్లు ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

## ఏపీ రాష్ట్ర స్థాయి యోగాసన జడ్జిల ఎంపిక


నియామక పత్రాలు అందుకుంటున్న వెంకట్

**ఉరవకొండ, మే 22:** ఏపీ రాష్ట్ర స్థాయి యోగాసన జడ్జిలుగా ఉరవకొండకు చెందిన ఉపాధ్యాయులు టీ వెంకట్, మంజునాథ్ ఎంపికయ్యారు. అనంతపురం లో ఈ నెల17 నుంచి 19 వరకూ యోగా భారత్ ఆధ్వర్యంలో న్యాయనిర్ణేతల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన పరీక్షలలో వారిద్దరూ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి యోగాసన జడ్జిలుగా ఎంపికయ్యారు. ఎంపికైన వారికి ఏపీ యోగా భారత్ రాష్ట్ర అధ్యక్షులు రాధిక నియామక పత్రాలను అందజేశారు.

## 'శ్రీరామిరెడ్డి' కార్మికుల నిరసన

**కూడేరు, మే 22:** కాంట్రాక్టర్ తమను వేధిస్తున్నాడని శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికులు బుధవారం నిరసనకు దిగారు. దీంతో కళ్యాణదుర్గం, రాయదుర్గం తదితర ప్రాంతాలకు నీటి సరఫరా నిలిచి పోయింది. విషయం తెలుసుకున్న కలెక్టర్ కార్మిక సంఘం నాయకులతో చర్చించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

## వైభవంగా అక్క దేవతల ఉత్సవాలు

**కూడేరు, మే 22:** మండలంలోని కరుట్లపల్లి గ్రామంలో అక్క దేవతల ఉత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. చివరి రోజు వసంతోత్సవం సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అనంతరం గ్రామవీధుల్లో భక్తులు వసంతాలు చల్లుకుంటూ అమ్మ వారిని ఊరేగింపుగా తీసుకెళ్లి తిమ్మాపురం గ్రామంలోని ఆలయానికి చేర్చారు. అమ్మవారి ఉత్సవాలను హైదరాబాద్‌కు చెందిన మలోబన్న నిర్వహించారు.







# రేపటి నుంచి విత్తన వేరుశనగ పంపిణీ


రికార్డులు పరిశీలిస్తున్న జేడీ ఉమామహేశ్వరమ్మ

**బెళుగుప్ప, మే 22:** జిల్లాలో అర్హులైన రైతులకు నాణ్యమైన విత్తన వేరుశనగను ఈ నెల 24 నుంచి పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు జేడీ ఉమా మహేశ్వరమ్మ తెలిపారు. బుధవారం ఆమె బెళుగుప్పలోని వినాయక సీడ్స్ విత్తన వేరుశనగ ప్రాసెసింగ్ యూనిట్‌ను తనిఖీ చేశారు. కాయలను, మొలక శాతాన్ని, రికార్డులను పరిశీలించారు. గడువు లోగా విత్తనం రైతు భరోసా కేంద్రాలకు తరలించడానికి సిద్ధంగా వుంచాలని ఏజెన్సీ వెంకటనాయుడుకు సూచించారు. రోజు తనిఖీలు నిర్వహించి విత్తనం నాణ్యతగా వుండేలా చర్యలు తీసుకోవాలని ఏడీఏ యల్లప్ప, వ్యవసాయాధికారులు పృథ్వీసాగర్, వాసుకి రాణిలను ఆదేశించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లాకు 76800 క్వింటాళ్ల విత్తనం మంజూరైందని, నాణ్యత లో రాజీపడకుండా అర్హులందరికీ విత్తనం పంపిణీ చేస్తామన్నారు. జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో విత్తన కాయలు సిద్ధంగా వుంచి సమస్య తలెత్తకుండా సజావుగా పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు. ఆమె వెంట స్థానిక వ్యవసాయాధికారులు ఉన్నారు.

# హత్య కేసులో ముగ్గురి అరెస్టు

**గుంతకల్లు, మే 22:** పట్టణ శివారులోని బళ్లారి రోడ్డు కల్వరి టెంపుల్ వద్ద ఈనెల 15న జరిగిన దేవేంద్రప్రసాద్ హత్యకు సంబంధించి ముగ్గురిని వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. వివాహేతర సంబంధం నేపథ్యంలో ఈ హత్య జరిగిందని వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య బుధవారం తెలిపారు. తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే నెపంతో సోమశేఖర్ మరికొంతమందితో కలిసి దేవేంద్రప్రసాద్ హత్యకు కుట్ర పన్నాడు. సోమశేఖర్ తన సమీప బంధువైన జలపతి పెద్దరాయుడు, స్నేహితుడు ప్యాపిలి రాముతో కలిసి హత్యచేయడానికి నిర్ణయించుకున్నాడు. బేల్దారి మేస్త్రి అయిన దేవేంద్ర ప్రసాద్ వద్ద జలపతి పెద్దరాయుడు బేల్దారి పని చేసేవాడు. ఈ నేపథ్యంలో అతడి ద్వారా దేవేంద్రప్రసాద్‌ను ఊరి బయటకు తీసుకురావడానికి పథకం రచించాడు. ఈక్రమంలో ఈ నెల 14న మద్యం తాగేందుకు బళ్లారి రహదారి పక్కన ఉన్న కల్వరి టెంపుల్‌కు ఎదురుగా వ్యవసాయ భూమిలోకి దేవేంద్ర ప్రసాద్‌ను తీసుకెళ్లాడు. మద్యం తాగిన తర్వాత దేవేంద్ర వెళ్లిపోకుండా ప్యాపిలి రాము రెండు కాళ్లను పట్టుకోగా, సోమశేఖర్ తాడును గొంతుకు బిగించి చంపివేశాడు. 15న పొలంలో దేవేంద్రప్రసాద్ చనిపోయి కనిపించడంతో తాము వెళ్లి మృతదేహానికి పోస్టుమార్టంకు చేయించి, విచారణ చేపట్టినట్లు సీఐ తెలిపారు. నిందితులు ముగ్గురిని అరెస్ట్ చేసి, ఒక బైక్ ను స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. నిందితులను కోర్టుకు హాజరుపరచి రిమాండుకు తరలించారు.

## గూళ్యపాళ్యం స్టేషన్ వద్ద మాక్ డ్రిల్


మాక్ డ్రిల్‌ను నిర్వహిస్తున్న రైల్వే అధికారులు

**గుంతకల్లు, మే22:** రైలు ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యల సాధనకు అధికారులు గుంతకల్లుకు సమీపంలోని గూళ్యపాళ్యం రైల్వే స్టేషన్ వద్ద బుధవారం ఉదయం మాక్ డ్రిల్‌ను నిర్వహించారు. ఉదయం ఏడున్నర గంటల సమయంలో గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో ప్రమాద హెచ్చరిక సైరన్‌ను మోగించగా, వచ్చిన సమాచారం మేరకు యాక్సిడెంట్ రిలీఫ్ వ్యాన్, వైద్య సిబ్బంది, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది ప్రత్యేక రైలులో ప్రమాద స్థలానికి వెళ్లారు. పట్టాలు తప్పినట్టుగా ఉంచిన రైలు బోగీ నుంచి ప్రయాణికులను బైటకు తీసుకువచ్చే సహాయక చర్యలు, గాయపడిన ప్రయాణికులకు వైద్య సహాయం అందించే కార్యక్రమంపై మాక్ డ్రిల్ నిర్వహించారు. డీఆర్ఎం వినీత్ సింగ్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

# మా డబ్బులు వెనక్కి ఇప్పించండి

### హౌసింగ్ ఏఈని నిలదీసిన లబ్ధిదారులు


ఏఈని చుట్టుముట్టిన లబ్ధిదారులు

**యాడికి, మే22:** మాతో అదనంగా కట్టించుకున్న రూ.35వేలు మాకు వెనక్కి ఇస్తారా? లేదా? అని పలువురు హౌసింగ్ లబ్ధిదారులు ఏఈ ప్రశాంత్‌కుమార్‌ను నిలదీశారు. నెలల తరబడి కాంట్రాక్టర్ హౌసింగ్ నిర్మాణ పనులు చేపట్టకపోవడంపై 30మంది లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు బుధవారం హౌసింగ్ కార్యాలయానికి చేరుకొని ఏఈని చుట్టుముట్టారు. ఇళ్ల నిర్మాణం కోసం మాతో అదనంగా కట్టించుకున్న రూ.35వేలు వెనక్కి ఇవ్వాలని వాగ్వాదానికి దిగారు. కాంట్రాక్టర్‌ను ఇప్పుడు పిలిపిస్తాం, అప్పుడు పిలిపిస్తాం అంటూ ఇంకెన్నాళ్లు కాలయాపన చేస్తారంటూ నిలదీశారు. మా డబ్బులు వెనక్కు ఇవ్వకపోతే ఇక్కడి నుంచి కదిలే ప్రసక్తే లేదని తెలిపారు. కాంట్రాక్టర్‌ను పిలిపిస్తామని ఉన్నతాధికారులతో మాట్లాడతామని మీ డబ్బులు మీకు ఇప్పిస్తామని ఇందుకోసం కొంచెం సమయం ఇవ్వాలని లబ్ధిదారులను ఏఈ కోరారు. డబ్బులు వెనక్కి ఇవ్వాలని కోరుతూ అంగీకారపత్రం ఇవ్వాలని లబ్ధిదారులకు సూచించారు. దీంతో లబ్ధిదారులు అక్కడికక్కడే అంగీకారపత్రాన్ని రాసి ఏఈకి అందజేశారు. వీలైనంత తొందరలోనే మీ డబ్బులు వెనక్కి ఇప్పిస్తామని ఏఈ లబ్ధిదారులకు సర్దిచెప్పి పంపారు.